మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 74 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada

గురువారం 06 జూన్ 2024

## విధ్వంసానికి గురైన ఏపిని గాడిలో పెడతాం



- ఎంతటి త్యాగాలకైనా వెనకాడకుండా పనిచేస్తాం
- జగన్ ఐదేళ్ల పాలనను గతంలో ఎప్పుడూ చూడలే
- భావితరాల భవిష్యత్ కోసం ముందుకు సాగుతాం
- ఇంతటి చారిత్రక విజయం ప్రజలిచ్చిన వరం
- వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ పోతాం
- పవన్ కళ్యాణ్ సంకల్ప బలం బాగా కలిసి వచ్చింది
- మీడియా సమావేశంలో చంద్రబాబు నాయుడు

2లో..



# 100 రోజుల పాలను ప్రజలు ఆదరించారు

- బీజేపీ గెలుపుకు పూర్తిగా సహకరించింది
- రాష్ట్రంలో సెక్యులర్ వాదులు అప్రమత్తం కావాలి
- ప్రజలు తిరస్కరించిన మోదీ.. ప్రధాని పదవిని ఎలా చేపడతావు?
- ప్రశ్నించిన సీఎం రేవంత్
- ప్రజల తీర్పును గౌరవిస్తున్నాం
- అది ఉగాది పచ్చడి లాంటిదని భావిస్తున్నాం
- గతంలో 3 సీట్లు ఇచ్చిన ప్రజలు ఇప్పుడు 8చోట్ల గెలిపించారు
- గెలుపోటములకు పీసీసీ చీఫ్‌గా బాధ్యత పూర్తిగా నాదే..
- ఉమ్మడి ఏపీ సమస్యలను చర్చలతో పరిష్కరించుకుంటాం
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి స్పష్టీకరణ

హైదరాబాద్, (ప్రజా మంటలు): ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని, ఇది తమకు ఉగాది పచ్చడి లాంటిదని సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. పార్మలెంట్ ఎన్నికల్లో తమ మీద విశ్వాసం ఉంచిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు సంతోషాన్నిచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ పాదయాత్రతోనే కాంగ్రెస్‌కు మెరుగైన ఫలితాలు వచ్చాయని చెప్పారు. కాంగ్రెస్ ను ఆదరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఖర్గే, సోనియా దిశానిర్ధేశంతో మంచి ఫలితాలు సాధించామని స్పష్టం చేశారు. వంద రోజుల పాలను ప్రజలు ఆదరించారన్నారు. అసెంబ్లీ ఎన్నికల కంటే మా ఓటింగ్ శాతం పెరిగిందని తెలిపారు. అందుకే కాంగ్రెస్ పాలనను మెచ్చుకుని ప్రజలు ఓటేశారని వెల్లడించారు సీఎం రేవంత్ రెడ్డి. 2019లో మూడు ఎంపీ సీట్లు ఇస్తే 2024లో ఆ సంఖ్య 8కి పెరిగిందని చెప్పారు. బీజేపీ గెలిచిన 8 సీట్లలో బీఆర్ఎస్ 7 చోట్లలో డిపాజిట్లు కోల్పోయిందని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆత్మబలిదానం చేసుకుని బీజేపీని గెలిపించారన్నారు. జేపీని గెలిపించడానికి కేసీఆర్ బలహీనమైన అభ్యర్థులను పెట్టారంటూ ఆరోపించారు. గాంధీభవన్‌లో

## డిసెంబర్ 9న తెలంగాణ తల్లి ఉత్సవాలు

### - సోనియాను ఆహ్వానిస్తాం:సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణ రాష్ట్రంలో ఇకపై ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి ఉత్సవాలు నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ రోజున సచివాలయంలోని అన్ని కార్యాలయాల్లో ఉత్సవాలు చేస్తామని పేర్కొన్నారు.తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని వెల్లడించారు. ఉత్సవాలకు కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీని ఆహ్వానించే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు.

## ముచ్చటగా మూడోసారి

# ఎన్డీయే సారథిగా మోదీ



- మద్దతు పలికిన కూటమి నాయకులు
- ఆయన నాయకత్వంపై విశ్వాసం ప్రకటించిన నేతలు
- రాష్ట్రపతిని కలసి లేఖ అందచేయనున్న నేతలు
- 8న ప్రధానిగా మోదీ ప్రమాణం

న్యూఢిల్లీ (ప్రజా మంటలు): ఎన్డీయే పక్షనేతగా నరేంద్రమోదీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు భాగస్వామ్య పార్టీల నేతలు తీర్మానించారు. దిల్లీలోని ప్రధాని నివాసంలో జరిగిన సమావేశానికి తెదేపా అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, జేడీయూ అధ్యక్షుడు నీతీశ్ కుమార్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, మిగతా 2లో..

# అవినీతికి పాల్పడిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టం

- ఫలితాల్లో నంబర్ల గేమ్ కొనసాగుతూనే ఉంటుంది
- ఇది రాజకీయాల్లో భాగమే
- దశాబ్ద కాలంలో దేశ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేసింది
- మంత్రివర్గ భేటీలో ప్రధాని మోడీ స్పష్టీకరణ
- మోదీకి పలు దేశాధినేతల శుభాకాంక్షలు



న్యూఢిల్లీ (ప్రజా మంటలు): సార్వత్రిక ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించిన ఎన్డీయే కూటమి కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే బుధవారం ప్రధాని నివాసంలో కేంద్ర మంత్రివర్గం చివరిసారిగా సమావేశమైంది. ఈ సందర్భంగా మోదీ కేబినెట్‌కు కీలక సూచనలు చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలపై కూడా ఆయన మాట్లాడారు. ఫలితాల్లో నంబర్ల గేమ్ కొనసాగుతూనే ఉంటుంది. ఇది రాజకీయాల్లో భాగమే. దశాబ్ద కాలంలో దేశ అభివృద్ధికి సర్కార్ ఎంతో కృషి చేసింది. అందుకు మీరూ ఎంతో శ్రమించారు. దీన్ని ఇలాగే కొనసాగించండి. అవినీతిపై పోరాటం మరింత పటిష్ఠంగా మారుతోంది. రాజకీయ ప్రయోజనాల కోసం అవినీతిని కొందరు కీర్తిస్తున్నారు. ఈ సారి అవినీతిని రూపుమాపడంపై ఎన్డీయే దృష్టి సారిస్తుంది. ప్రపంచంలో భారత్ బలమైన శక్తిగా అవతరిస్తుంది. మనమంతా సమష్టిగా కృషి చేస్తే సరికొత్త అధ్యాయాన్ని లిఖించవచ్చు. ఇదే ప్రజలకు మోదీ హామీ అని ప్రధాని అన్నారు. ఇందుకు కూటమి కట్టుబడి ఉంది..కొందరు 10 గంటలు పనిచేస్తే.. మిగతా 2లో..



## అసోంను వదలని వరదలు

### 25కు చేరిన మృతుల సంఖ్య

గౌహతి,జూన్5 (ప్రజా మంటలు): రెమాల్ తుపాన్ కారణంగా భారీ వర్షాలు, వరదలతో ఈశాన్యంలోని పలు రాష్ట్రాలు అతలాకుతలమవుతున్నాయి. ఆ క్రమంలో అసోంలో కురిసిన భారీ వర్షాలకు, వరదలకు మరణించిన వారి సంఖ్య మిగతా 2లో..



# భవిష్యత్ కార్యచరణపై ఇండియా కూటమి చర్చ

- కూటమిలోకి ఇతర పార్టీలను ఆహ్వానిస్తున్నాం
- ఈ ఎన్నికల్లో ప్రజలు మోదీకి వ్యతిరేకంగా తీర్పునిచ్చారు
- ఆయన నైతికంగా ఓడిపోయారు
- వ్యక్తిగతంగా, రాజకీయంగానూ నష్టపోయారు
- ఖర్గే కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ (ప్రజా మంటలు): సార్వత్రిక ఎన్నికల ఫలితాలు తేలడంతో దిల్లీలో అటు ఎన్డీయే.. ఇటు 'ఇండియా' కూటమి నేతల భేటీలతో దేశ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఎన్డీయే కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతున్న వేళ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'ఇండియా' కూటమి సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో ప్రజాభిప్రాయం ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వచ్చిందన్న ఖర్గే.. ఆయన నైతికంగా ఓడిపోయారన్నారు. అంతేకాకుండా వ్యక్తిగతంగా, మిగతా 2లో..


## మణిపూర్‌లో 2 ఎంపీ స్థానాలు కాంగ్రెస్ కైవసం

### - ఇది మోదీకి చెంపపెట్టు :జైరాం రమేష్




న్యూఢిల్లీ (ప్రజా మంటలు): సార్వత్రిక ఎన్నికల ఫలితాలు అంచనాలకు భిన్నంగా వెలువడ్డాయి. ఇండియా కూటమి 233 స్థానాలను కైవసం చేసుకొంది. అయితే.. జాతుల మధ్య వైరంగా కొనసాగుతున్న మణిపుర్ లోని రెండు ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందారు. కల్లోలిత ప్రాంతంలో హస్తం పార్టీ విజయం సాధించడంపై సీనియర్ నేత జైరాం రమేశ్ హర్షం వ్యక్తం చేశారు. "గతేడాది మే 3 నుంచి జాతుల వైరంతో మణిపుర్ అల్లకల్లోలమవుతోంది. నాటినుంచి నేటివరకు అక్కడి ప్రజలు నిత్యం ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎంతో ఒత్తిడికి లోనవుతున్నారు. మణిపుర్‌లోని రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్‌ను ఎన్నుకుని ఎంతో శక్తివంతమైన సంకేతాలను పంపారు. మణిపుర్ ప్రజలు హస్తం పార్టీకి పెద్ద బాధ్యతను అప్పగించారు" అని జైరాం రమేశ్ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా పేర్కొన్నారు. "క్లిష్ట సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మణిపుర్‌ను ప్రధాని మోదీ ఇంతవరకు సందర్శించలేదు. ఆయన ప్రజలను పట్టించుకోలేదు. గతంలో రాహుల్ గాంధీ మణిపుర్ పర్యటనకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ప్రజలను సంప్రదించకుండా చేసింది. అనుమతించని ప్రాంతంలో కాంగ్రెస్ గెలుపు మోదీకి చెంపపెట్టు" అని కాంగ్రెస్ నేత తీవ్ర విమర్శలు గుప్పించారు. ఔటర్ మణిపుర్‌లో కాంగ్రెస్ తరఫున ఎన్నికల బరిలోకి దిగిన ఆల్‌ఫ్రెడ్ కన్‌గమ్ ఎస్.ఆర్థర్ తన సమీప ప్రత్యర్థి, ఎన్‌పీఎఫ్‌కి చెందిన కచుయ్ తిమోతీ జిమిక్‌ను 85,418 ఓట్ల తేడాతో ఓడించారు. ఇన్నర్ మణిపుర్‌లో అంగోమ్‌చా బిమోల్ అకోయిజం భాజపాకు చెందిన తౌనోజం బసంతకుమార్‌పై 1,09,801 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

## ప్రజా నాడి




## కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

### మధ్యంతర బెయిల్ తిరస్కరణ



న్యూఢిల్లీ (ప్రజా మంటలు): మధ్యంతర బెయిల్ కోసం దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చేసిన అభ్యర్థనను దిల్లీ కోర్టు తిరస్కరించింది. బరువు తగ్గడం, కిడ్నీ సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు చేయించుకునేందుకు మధ్యంతర బెయిల్ పొడిగించాలని కేజ్రీవాల్ అభ్యర్థన చేసుకున్న సంగతి తెలిసిందే. దానిపై ఇప్పటికే మిగతా 2లో..

## జవాబుదారీ ప్రభుత్వాన్ని నడుపుదాం

- ఖచ్చితంగా జీతం తీసుకుని పనిచేస్తా
- ప్రజల స్వేదం చిందించిన డబ్బుతో అప్రమత్తంగా ఉంటా
- ఎంపిలు, ఎమ్మెల్యేలతో భేటీలో పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు



అమరావతి,జూన్5 (ప్రజా మంటలు): ఎమ్మెల్యేగా తాను పూర్తి జీతం తీసుకుంటానని జనసేనాని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఏపీ ఎన్నికల్లో సంచలన విజయం తర్వాత జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలతో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆసక్తికర



## 17వ లోక్‌సభ రద్దు
## ప్రకటన విడుదల చేసిన రాష్ట్రపతి భవన్

న్యూఢిల్లీ,జూన్ 5 (ప్రజా మంటలు):
భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 17వ లోక్‌సభను రద్దు చేశారు. ప్రస్తుత లోక్‌సభను రద్దు చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారధ్యంలోని కేంద్ర క్యాబినెట్ బుధవారం ఉదయం సిఫారసు చేసింది. ఆ వెంటనే మోదీ తన రాజీనామాతో పాటు మంత్రివర్గ రాజీనామా పత్రాలను రాష్ట్రపతిని కలిసి నేరుగా కలిసి సమర్పించారు. రాష్ట్రపతి వెంటనే ఆమోదం తెలుపుతూ, కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసేంతవరకూ ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగాలని మోదీని కోరారు. అనంతరం కొద్ది గంటలకే 17వ లోక్‌సభను రద్దయినట్టు రాష్ట్రపతి భవన్ నుంచి ఒక ప్రకటన వెలువడింది. జూన్ 5వ తేదీ 2024న కేంద్ర మంత్రివర్గం చేసిన సిఫారసు మేరకు రాజ్యాంగంలోని 85వ నిబంధన సబ్–క్లాజ్ (2) కింద నాకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ 17వ లోక్‌సభను రద్దు చేస్తున్నాను‘ అని రాష్ట్రపతి భవన్ నుంచి వెలువడిన ప్రకటనలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. కాగా, ప్రస్తుత లోక్‌సభ రద్దు కావడంతో 18వ లోక్‌సభ ఏర్పాటుకు, కొత్త ప్రభుత్వం కేంద్రంలో పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. షెడ్యూల్ ప్రకారం 17వ లోక్‌సభ గడువు జూన్ 16వ తేదీతో ముగియాల్సి ఉంది.

## ఎపి అసెంబ్లీ రద్దు
## నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్

అమరావతి,జూన్ 5 (ప్రజా మంటలు): ):
ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీని రద్దు చేస్తూ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆర్టికల్ 174 ప్రకారం మంత్రివర్గం సిఫార్సు మేరకు ఏపీ శాసనసభను రద్దు చేస్తూ నోటిఫికేషన్ విడుదలైంది. సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. తెదేపా 135, జనసేన 21, భాజపా 8 అసెంబ్లీ స్థానాల్లో గెలుపొందాయి. దీంతో కొత్త ప్రభుత్వం కొలువుదీరేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రిగా తెదేపా అధినేత చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఏపీ అసెంబ్లీని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రద్దు చేశారు. 15వ అసెంబ్లీని రద్దు చేస్తూ గవర్నర్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఏపీ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ – జనసేన – బీజేపీ కూటమి భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పటిదాకా అధికారంలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి కేవలం 11 సీట్లు మాత్రమే వచ్చాయి. ఫలితంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గవర్నర్ ను కలిసి రాజీనామా సమర్పించారు. ఆయన రాజీనామాను ఆమోదించిన గవర్నర్.. కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేసేవరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరారు.ఏపీ అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. టీడీపీ 135, జనసేన 21, బీజేపీ 8 అసెంబ్లీ స్థానాల్లో గెలిచాయి. దీంతో కొత్త ప్రభుత్వం ఏర్పడడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమం అమరావతిలో ఉంటుందని గతంలోనే ప్రకటించారు.

## రెవెన్యూ శాఖలో దస్త్రాలను ప్రాసెస్ చేయవద్దు

**ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ ఆదేశాలు**

అమరావతిజూన్ 5 (ప్రజా మంటలు):
రెవెన్యూ శాఖలో ముఖ్యమైన దస్త్రాలను ప్రాసెస్ చేయవద్దని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ ఆదేశాలు జారీ చేశారు. మంత్రి పేషీలోని రికార్డులు, దస్త్రాలను జాగ్రత్తపరచాలని సిబ్బందికి సూచించారు. గుత్తేదారులకు నిధుల విడుదల, భూ కేటాయింపు దస్త్రాలు నిలిపివేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. బదిలీలు, సెలవులపై కూడా నిర్ణయాలు తీసుకోవద్దని స్పష్టం చేశారు. మరో వైపు సచివాలయంలోని మంత్రుల ఛాంబర్లను సాధారణ పరిపాలనశాఖ స్వాధీనం చేసుకుంటోంది. మంత్రులు, సలహాదారుల పేషీల నుంచి నేమ్ బోర్డులను జీఏడీ సిబ్బంది తొలగించారు. మంత్రుల పేషీల్లోని ఫర్నీచర్, కంప్యూటర్ల వివరాలను నమోదు చేసుకుని జీఏడీ అధికారులు లెక్కలు సరిపోల్చుకుంటున్నారు. వ్యక్తిగత సామగ్రి సచివాలయం నుంచి బయటకు తీసుకెళ్లేందుకు బిల్లులు చూపించాలని అధికారులు స్పష్టం చేశారు.

## పవన్‌కు వెంకటేశ్ అభినందనలు

హైదరాబాద్,జూన్ 5 (ప్రజా మంటలు):
పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో జనసేనాని పవన్ కల్యాణ్ విజయం పట్ల టాలీవుడ్ అగ్ర కథానాయకుడు వెంకటేశ్ ట్విట్టర్ ఎక్స్ ద్వారా స్పందించారు. ప్రియమైన పవన్ కల్యాణ్ చారిత్రక విజయం సాధించినందుకు కంగ్రాచ్యులేషన్స్. ఇంతటి ఘన విజయాన్ని అందుకోవడానికి నీకంటే అర్హులెవరూ లేరు మిత్రమా. నువ్వు మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని, ఇకమీదట కూడా నీ కఠోర శ్రమతో, నీ శక్తితో, ప్రజలకు సేవ చేయాలన్న అంకితభావంతో స్ఫూర్తి కలిగిస్తూనే ఉండాలని కోరుకుంటున్నాను..‘ అంటూ వెంకీ ట్వీట్ చేశారు. మీకు అంతా మంచే జరగాలని కోరుకుంటున్నాను పిఠాపురం ఎమ్మెల్యే గారూ అంటూ సరదాగా వ్యాఖ్యానించారు.

## బిఆర్ఎస్ ఛాప్టర్ క్లోజ్ : మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు



హైదరాబాద్, జూన్ 5 (ప్రజా మంటలు):
బై బై బీఆర్ఎస్ అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. నాలుగు నెలలకే రెఫరెండం అని ప్రజల్లోకి వెళ్లి ఓటు శాతం పెంచుకున్నామన్నారు. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం గెలుచుకోవడం సంతోషంగా ఉందన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆవేదనలో, బాధలో ఉన్నారన్నారు. కేసీఆర్ బస్సు ఎక్కి తిరిగినా డిపాజిట్లు కూడా రాలేదన్నారు. బీఆర్ఎస్ అధ్యాయం ముగిసిందని.. కేసీఆర్ తన పార్టీ క్లోజ్ చేసుకుంటే మంచిదన్నారు. ఈ రిజల్ట్‌తో మాలో ఆత్మ విశ్వాసం పెరిగిందన్నారు. ఇకపై ఏ ఎన్నికలు వచ్చినా మా టీమ్ లీడర్ రేవంత్ నాయకత్వంలో క్లీన్ స్వీప్ చేస్తామన్నారు. 15 ఏళ్లు అధికారంలో తామే ఉంటామని కోమటిరెడ్డి వెల్లడించారు.



## హైదరాబాద్‌లో మారిన వాతావరణం

### సాయంత్రం అనూహ్యంగా భారీ వర్షం

హైదరాబాద్, జూన్ 5 (ప్రజా మంటలు):
హైదరాబాద్ మహానగరంలో ఉన్నట్లుండి వాతావరణం ఒక్కసారిగా చల్లగా మారిపోయింది. జంటనగరాలలో చాలా ప్రాంతాల్లో మధ్యాహ్నం ఎండవేడి బాగానే ఉండగా, అయితే సాయంత్రం కాగానే ఒక్కసారిగా దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. దీనితో నగరంలోని అనేక చోట్ల ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఇక జంట నగరలలో కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, రాయదుర్గం ఇలా అనేక ప్రాంతాల్లో గాలి ఉరుములతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. ఇక సిటీ మరో వైపు చూస్తే.. బంజారా హిల్స్, జూబ్లీ హిల్స్, పంజాగుట్ట, పాత బస్తీ, మలక్ పేట, నాంపల్లి, నారాయణగూడ, బషీర్ బాగ్, అబిడ్స్ ప్రాంతాల్లో కూడా ఎడతెరపి కూడిన వర్షం కురుస్తోంది. దింతో నగరంలోని అధికారులు అప్రమత్తయ్యారు. ముఖ్యంగా వాహనదారులు చాలా జాగ్రత్తగా వాహనాలను నడుపుతూ క్షేమంగా ఇంటికి వెళ్లాలని కోరారు. గత రెండు మూడు రోజులుగా ఉదయంపూట వాతావరణం వేడిగా ఉన్న సాయంత్రం అయ్యేసరికి వరసలు కురుస్తున్నాయి. దీనితో నగర ప్రజలు కాస్త ఎండ తీవ్రత నుండి ఉపశమనం పొందుతున్నారు. నైరుతి రుతుపవనాలు చురుకుగా కదలడంతో తెలుగు రాష్ట్రాలపై ప్రభావం చూపుతున్నాయి. మూడు రోజుల కిందట నైరుతి రుతుపవనాలు ఏపీలోకి ప్రవేశించాయి. అదేరోజు అటు ఆంధ్రప్రదేశ్ లో పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. తెలంగాణలోనూ గత మూడు రోజుల నుంచి ఏదో చోట తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షం కురుస్తోంది. హైదరాబాద్ లో బుధవారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి బయలుదేరే సమయంలో వాన పడటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు కొన్ని మార్గాల్లో ఇబ్బంది పడ్డారు. అమీన్‌పూర్, కిష్టారెడ్డిపేట, కూకట్ పల్లి, లింగంపల్లి, కొండాపూర్, మాదాపూర్, నిజాంపేట తదితర ప్రాంతాల్లో వర్షం దంచికొడుతోంది. సరూర్ నగర్, సైదాబాద్ లలో వర్షం పడుతోంది. అటు మియాపూర్ నుంచి ఇటు వనస్థలిపురం వరకు సికింద్రాబాద్, హైదరాబాద్ వ్యాప్తంగా మరికొన్ని గంటలపాటు వర్షం కురుస్తుందని తెలంగాణ వెదర్ మ్యాన్ తెలిపారు. నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఉపరితల ఆవర్తనం దక్షిణ ఆంధ్రప్రదేశ్ దాని పరిసర ప్రాంతాలలో సముద్రమట్టానికి 3.1 నుంచి 4 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది. దీని ప్రభావం, నైరుతి రుతుపవనాల వ్యాప్తితో మరో రెండు, మూడు రోజులు తెలంగాణలో పలు జిల్లాల్లో వర్షాలు కురవనున్నాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వర్ష సూచన ఉన్న జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసి ప్రజల్ని అప్రమత్తం చేశారు. సిద్దిపేట, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, కామారెడ్డి జిల్లాల్లోనూ వర్షం కురిసే అవకాశం ఉందని వెదర్ మ్యాన్ అంచనా వేశారు. ఈ జిల్లాలతో పాటు మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షం కురవనుంది. జీహెచ్ఎంసీ ప్రాంతాల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చే సమయంలో జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు.

## హుండీ లెక్కింపు
## రోజు రోజుకి పెరుగుతున్న ఆదాయం



వేలేరు జూన్ 05 (ప్రజామంటలు):
వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలోని శ్రీ గట్టు మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన హుండీలు బుదవారం ఉదయం లెక్కించగా రూ. 41,717 నలుబది ఒక వెయ్యి ఏడువందల పదిహేడు రూపాయల ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి అద్దంకి నాగేశ్వరరావు తెలిపారు. దేవాదాయశాఖ పరిశీలకులు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్చకులు వినయ్ శర్మ, మహేష్ మరియు ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ బాధ్యత మనదే

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్న మంత్రి పొన్నం



హైదరాబాద్, జూన్ 5 (ప్రజా మంటలు):
ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తన నివాస ఆవరణలో మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు. భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే విధిగా ప్రతి పౌరుడు మొక్కలు నాటాలని తెలిపారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. రాబోయే సమాజాన్ని కాపాడటంలో మనమంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పిల్లలకు ప్రతి రోజు మొక్కలకు నీళ్లు పోసే విధంగా అలవాటు చేయాలన్నారు. పర్యావరణాన్ని రక్షిస్తేనే ఆ పర్యావరణం మనల్ని రక్షిస్తుందన్నారు. పర్యావరణాన్ని చెడగొట్టే విధంగా చెట్లు కొట్టవద్దని కోరారు. మొక్కలు నాటకపోవడంతో ప్లాస్టిక్ వాడకం పెరిగి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఇప్పటికే కాలుష్యం పెరిగి క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరిగిపోతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ రాష్టాన్ని పచ్చదనంతో నింపి పర్యావరణాన్ని రక్షించాలని పిలుపునిచ్చారు. కాలుష్యరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.



## పర్యావరణ రక్షణ తోనే ప్రజా ఆరోగ్యం

**సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రసాద్**

మెట్టుపల్లి జూన్ 05 (ప్రజామంటలు):
పర్యావరణ రక్షణ తోనే ప్రజలు, తద్వారా సమాజం ఆరోగ్యంగా ఉంటుందని మెట్ పల్లి మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ మరియు సీనియర్ సివిల్ జడ్జ్ కె. ప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మెట్ పల్లి కోర్టులో ఏర్పాటు చేసిన ప్రత్యేక హరితహారం కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%ొ%. ప్రజా ఆరోగ్యం సరిగ్గా లేకపోతే సామాజికంగా ఘర్షణ వాతావరణం ఏర్పడుతుందన్నారు. సమాజంలో ఘర్షణలు, నేరాలు లేని వాతావరణానికి అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ఉపాధ్యక్షుడు ఎలుముల రాంబాబు, ప్రధాన కార్యదర్శి తునికి వేణుగోపాల్, న్యాయవాదులు గంద్ర ప్రవీణ్ రావ్, కోటగిరి వెంకటస్వామి, గడ్డం శంకర్ రెడ్డి, బద్దం లక్ష్మారెడ్డి, బోడ లక్ష్మణ్, బెజ్జరాపు ప్రవీణ్, వేముల సునీల్, ఓగులపు శేఖర్, బక్కూరి రమేష్, కోట రాజారెడ్డి, కాజీపేట స్రవంతి, కొల అశోక్ గౌడ్, జేడీ సుధాకర్, ఉడుత ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ గెలుపుతో తెలుగు మరింత అభివృద్ధి

**గెలుపు సంబరాలలో పవన్ కళ్యాణ్ అభిమాన సంఘ నాయకులు రాధారపు ప్రభాకర్**



ఇబ్రహీంపట్నం జూన్ 05 (ప్రజామంటలు):
జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ గెలుపు పట్ల తెలుగు రాష్ట్రాలు మరింత అభివృద్ధిలో ముందుకు సాగుతాయని కరీంనగర్ జిల్లా పవన్ కళ్యాణ్ అభిమాన సంఘ నాయకులు రాధరపు ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో సోమవారం పవన్ కళ్యాణ్ అభిమాన సంఘం, జనసేన పార్టీ నాయకులు ఆంధ్రప్రదేశ్ లో పిఠాపురం ఎమ్మెల్యేగా పవన్ కళ్యాణ్ గెలవడంతోపాటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి గెలుపులో ప్రత్యేక భూమిక పోషించటం అభినందిస్తూ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం గ్లాసులను ప్రదర్శిస్తూ జై పవన్ జై జై పవన్ అంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ భారతదేశ ప్రదాని నరేంద్ర మోదీ మరోసారి ప్రదాని కావటం తో తెలుగు రాష్ట్రాల కు ప్రత్యేక చోరవతో మరింత అభివృద్ధి పవన్ కళ్యాణ్ తో జరుగుతుందని ఆశభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు బర్మ నాగేష్, అరె నరేంధర్, బండమీది రాజేష్, పుప్పాల నాగేష్, ఆరె అరుణ్, ఆకు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు అంజన్న మహిమ... మరోసారి రుజువు...

## పవన్ కళ్యాణ్ గెలుపు.. జనసేన విజయం..

### జై అంజన్నా... జైజై అంజన్నా..

జగిత్యాల జూన్ 04 (ప్రజామంటలు): నమ్ముకొన్నవారికి కొంగు బంగారమైన కొండగట్టు ఆంజనేయస్వామి రాజకీయ నాయకుల నమ్మకాన్ని కూడా నిలబెడుతున్నట్లుంది. రాజకీయ జీవితం ప్రారంభించిన పవన్ కళ్యాణ్ రెండు సార్లు స్వామివారిని దర్శించుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఒకసారి, మళ్ళీ గత సంవత్సరం పవన్ కళ్యాణ్ కొత్తగా వారాహి ప్రచార వాహనంతో వచ్చి కొండగట్టును దర్శించుకొని, వాహన పూజలు చేసుకొని, వారాహి వాహనంతో ఆంధ్ర ప్రదేశ్ లో ప్రచారం మొదలు పెట్టి, అఖండ విజయం సాధించారు. జనసేన పార్టీ అధినాయకుడు, కూటమిలో ప్రధాన నేతగా, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఆంధ్ర రాజకీయాలలో ప్రధాన పాత్ర పోషించనున్నారు. పవన్ కళ్యాణ్ ను కరుణించిన జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న స్వామి. వారాహి వాహనాన్ని కొండగట్టులో పూజ చేయించి, ప్రచారం మొదలు పెట్టి ఆంధ్రప్రదేశ్ కు పూర్తి సంపూర్ణ విజయం చేకూర్చటంలో విజయం సాధించారని అభిమానులు నమ్ముతున్నారు. దేశం మొత్తాన్ని తన వైపుకు చూసేలా కష్టపడ్డ జనసేనాని, పవన్ స్టార్ పవన్ కళ్యాణ్. తనకే కాకుండా ఆంధ్ర ప్రదేశ్ కూటమి కి విజయం సాధించి పెట్టిన కొండగట్టు అంజన్న మహిమ. ఎవరూ ఔనన్నా, కాదన్నా కొండగట్టు అంజన్న మహిమ మరో సారి రుజువు కావడం పట్ల పవన్ యువ సేన, అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



## సంపాదకీయం

# సంకీర్ణ రాజకీయాలను మోడీ అలవర్చుకోవాలి !

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు బిజెపికి ముఖ్యంగా మోడీ ద్వయానికి ఓ హెచ్చరిక లాంటివి. తమకు తిరుగులేదని వ్యవహరిస్తున్న ఈ ఇద్దరు నేతలకు ఫలితాలు మింగుడు పడనివే. 400 సీట్ల లక్ష్యంతో ఎన్నికల సమరంలో దూకిన వీరు కనీస మద్దతును కూడా తెచ్చుకోలేక పోయారు. దీంతో అసలు సిసలు ఎన్‌డిఎ ప్రభుత్వం ఇప్పుడు ఏర్పడబోతోంది. ఓ రకంగా చెప్పాలంటే ఈ ఇద్దరూ సంకీర్ణ ప్రభుత్వానికి కొత్త. గత రెండు పర్యాయాలు పూర్తి మెజార్టీతో పాలన చేపట్టిన మోడీ ద్వయం, ఎన్‌డిఎ మిత్రపక్షాలను పురుగుల్లా చూశారు. వారికి పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. పార్లమెంట్ లోపలా, బయటా వారికి విలువ ఇవ్వలేదు. కానీ ఇప్పుడలా కాదు. సంకీరణ ప్రభుత్వం ఏర్పాటులో అందరి అభిప్రాయాలను తీసుకుని ముందుకు సాగాల్సి ఉంటుంది. అలాగే ఎందుకింత తక్కువగా సీట్లు సాధించారో కూడా చర్చించాలి. ప్రజలు క్షేత్రస్థాయిలో పడుతున్న ఇబ్బందులను ఈ ఇద్దరూ ఏనాడూ చర్చించలేదు. పార్టీ వేదికలపైనా ప్రస్తావించలేదు. తాము పట్టిన కుందేటికి మూడే కొమ్ములు అన్నచందంగా ముందుకు సాగారు. నిర్ణయం ఏకపక్షంగా తీసుకోవడం, అమలు చేయడం చేశారు. జిఎస్టీని అద్భుతమైన బ్రహ్మపదార్థంగా చూపారు. దానివల్ల సామాన్యులు పడుతున్న ఇబ్బందులను పక్కన పెట్టారు. ఇన్‌కమ్ టాక్స్ బాధలను పట్టించుకోలేదు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం గురించి చర్చించలేదు. అలాగే ధరల పెరుగుదల, మందుల ధరల పెరుగుదలను పట్టించు కోవడం లేదు. ఈ దేశంలో ఏం జరిగినా మాకెందుకులే అన్న రీతిలో పాలన సాగింది. ఇప్పుడీ వ్యవహారాలు సాగకుండా ఎన్‌డిఎ నేతలు కట్టడి చేయాలి. అసలుసిసలు సమస్యలపై నిర్మాణాత్మక దృష్టి పెట్టాలి. ముందుగా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం నెలకొల్పాలి. పార్టీ ఎంపిల అభిప్రాయాలను తీసుకోవాలి. పార్లమెంటులో విపక్షాల చర్చలకు ప్రాధాన్యం ఇవ్వాలి. నిర్ణయాలపై పార్లమెంటులో సమగ్రంగా చర్చించ డం అలవచర్చుకోవాలి. ఇకపోతే విపక్షం కూడా ఇప్పుడు బలంగా ఉంది. గతంలో లాగా ఇష్టం వచ్చినట్లు చేద్దామంటే కుదరదు. ఎన్‌డీఏ కూటమి మరోసారి విజయం సాధించినా..పెద్దగా తమకు బలం లేదని, తాము సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతున్నామని నరేంద్ర మోదీ గుర్తుంచుకుని పాలన సాగించాలి. ఇకపోతే మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం ద్వారా మోడీ తొలి ప్రధాని నెహ్రూ రికార్డు సమం చేయను న్నారు. ఈ క్రమంలో ఆనాడు నెహ్రూ సాధించిన విజయాలను గుర్తించి అందులో కొన్నయినా సాధించ గలగాలి. నదుల అనుసంధానం, వ్యవసాయ పురోభివృద్ధి, ప్రాజెక్టుల నిర్మాణం వంటి విషయాల్లో గట్టి నిర్ణయాలు తీసుకోవాలి. మిత్రపక్షాల సాయంతోనే బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది కనుక వారి మాటలకు విలువ ఇవ్వాలి. అలాగే బిజెపిలోని ఎంపిలకు, సిఎంలకు విలువ ఇవ్వాలి. ఉమ్మడి నిర్ణయాలతో ముందుకు సాగడం మోడీ అలవర్చుకోవాలి. నీతి ఆయోగ్‌ను బలోపేతం చేయాలి. కేంద్ర రాష్ట్రాల మధ్య సంబంధాలను మెరుగు పర్చాలి. రాష్ట్రాలకు చట్టబద్దంగా ఇవ్వాల్సిన నిధులు విడుదల కావాలి. అభివృద్ధికి సంబంధించిన పనులను వేగాంగా అమలు చేయడం అలవర్చుకోవాలి. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల సంక్షేమం అన్నది ఉమ్మడిగా నిర్ణయించి ముందుకు సాగాల్సి ఉంది. పార్లమెంటులో సమస్యలపై చర్చించ లేదు. నీతి ఆయోగ్‌లోనూ ప్రధాని ప్రసంగానికే పెద్దపీట వేస్తున్నారు. హాజరైన సిఎంలు ప్రస్తావించిన అంశాలపై చర్చించడం లేదా, తదుపరి చర్యలు కానరావడం లేదు. మొత్తంగా దేశంలో కేంద్రంలో బిజెపి అధికారంలో ఉన్న కారణంగా ఇంతకాలం సమావేశాలు, చర్చలు అన్నవి తూతూ మంత్రంగా సాగాయి. సమావేశాలు, చర్చలు అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రజల ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా సాగాయి. అనేక సందర్భాల్లో నీతి ఆయోగ్ సమావేశాల్లో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు వివిధ సమస్యలపై నేరుగానే ప్రశ్నించారు. ఆయా రాష్ట్రాల సమస్యలను దేశం దృష్టికి తీసుకెళ్లారు. అయినా లాభం లేకపోవడంతో ఇక సమావేశాలకు హాజరు కావడం దండగ అన్న భావనలో ఉన్నారు. నీతి ఆయోగ్ ప్రారంభించి సమయంలో కనిపించిన స్ఫూర్తి లోపించింది. నీతి ఆయోగ్ ఏర్పాటు దశలో ప్రధాని మోడీ ఆనాడు చేసిన ప్రకటనకు భిన్నంగా ఈ పదేళ్లుగా నీతి తప్పిన ఆయోగ్‌గా అవతరించింది. సహకార సమాఖ్య సూత్రాలకు అనుగుణంగా మొత్తం దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలంటే ఆయా రాష్ట్రాలకు తగిన గౌరవం ఇచ్చి వారిని కూడా ఇందులో భాగస్వాములను చేయాల్సి ఉంది. రాష్ట్రాలను కలుపుకుని ముందుకు సాగాల్సిన కేంద్రం ఆ దిశగా పనిచేయడం లేదు. మళ్లీ పాతపద్దతిలోనే సాగుతామంటే ఇప్పుడు కుదరదని మోడీ గుర్తించాలి. రాష్ట్రాల సిఎంలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వారిచ్చే విలువైన సూచనలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వివిధ సమస్యలపై ప్రజలు అనేక సందర్భాల్లో తమ నిరసనలు వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎంపిలు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గవర్నర్ వ్యవస్థ ఇలా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం బదులు నానాటికి దిగజారుస్తున్నాయి. ప్రజల డబ్బు నీళ్లప్రాయంగా ఖర్చవుతోంది. రాజకీయాల్లో ఎదుటి పక్షాలను ఢీకొట్టేందుకు తమ తెలివిని ఉపయోగిస్తున్న పాలకులు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో శ్రద్ధ చూపడం లేదు. ఈ దశలో ఇలాంటి ప్రజాస్వామ్యం కొనసాగితే మరో 75 ఏళ్లయినా మన భారత్ రాత మారదు. రాజకీయ సంస్కరణలు రావాలి. పాలకుల తీరులో మార్పు రావాలి. ప్రజాధనం వృధా ఖర్చులకు కళ్లెం పడాలి. ముక్కుపిండి వసూలు చేస్తున్న పన్నులను పాలకుల విలాసా లకు ఖర్చు చేసుకుంటున్నారు. రాజ్యాంగం ఏ మేరకు ఎంతవరకు అమలు సాధించామన్నది పాలకులుగా రాజకీయ పార్టీల నేతలు మననం చేసుకోవాలి. అందరికీ సమ న్యాయం అందుతుందా అన్నది చూడాలి. ఉమ్మడి నిర్ణయాలతోనే ఇది సాధ్యమవుతుంది. అందువల్ల మోడీ ద్వయం ఇక సంకీర్న పాలనకు మానసికంగా సిద్దపడి ముందుకు సాగాలి. గతంలో లాగా ఏకపక్ష నిర్ణయాలు తగవని గుర్తించాలి. ప్రజల కోణంలో నిర్ణయాలు ఉండాల్సిందే. ఎన్‌డిఎ పక్షాలు కూడా పాలనపై పట్టు తప్పకుండా నిఘా పెట్టాలి.

## కవిత్వం

### ఇది తీర్పా..?
### కాదు ఓట్ల సునామి..!

నిరుపేదల ముఖాల్లో
చిరునవ్వులు
చూడాలని తలంచడం ఒక
శాపమా...?
ఎందరో పెత్తందార్లు
వ్యతిరేకించినా
ఎంతటి భారమైనా...
పేద విద్యార్థులకు బంగారు
భవిష్యత్తును
అందించాలని తపించడం ఒక
నేరమా..?

ఇంటికి దీపం ఇల్లాలని...
అమ్మఒడి పేరుతో నేరుగా
మహిళా
మణుల ఖాతాలకు ఆర్థిక
సహాయం అందజేయడం మేం
చేసిన పాపమా...?

ఓ దైవమా ఏమైంది
ఎందుకిలా జరిగింది?
మా అభేధ్యమైన కోట పైకి
ఎవరి విసిరారు ఓట్లబాంబులు
రెప్పపాటున మా కళ్ళముందే
కుప్పకూలిపోయిందే మా
సామ్రాజ్యం

ఇది విధి నవ్విన విషపు
నవ్వా...?
ఇది కాలం చేసిన
ఇంద్రజాలమా...?
ఇది అదృశ్యశక్తుల కుట్ర
ఫలితమా...?
ఓ దైవమా ఏమైంది..?
ఎందుకిలా జరిగింది..?
ఎంతకూ అర్థంకాకున్నదే
ప్రజాకోర్టులో నా ఓటర్లిచ్చిన
ఈ చారిత్రాత్మక
సంచలనాత్మకమైన తీర్పు...
ఔరా ఇది తీర్పా..? కాదు ఓట్ల
సునామి..!

రచన :
"కవి రత్న"
"సహస్ర కవిభూషణ్"
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్

# విద్యా,వైద్యరంగాలను సంస్కరించాలి

## గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయాలి - సంకీర్ణ ప్రభుత్వం దీన్నొక బాధ్యతగా తీసుకోవాలి





న్యూఢిల్లీ,జూన్5(ప్రజామంటలు):
దేశంలోనిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ఆరోగ్యం అందని ద్రాక్షగా మారింది. విద్య విలాసవస్తువుగా మారింది. ఇలాంటి అసమానతలను రూపుమాపేందుకు సంకీర్ణ పాలకులు చిత్తశుద్దితో కృషి చేయాలి. ఇప్పుడు కేవలం బిజెపి పాలనలాగా కాకుండా ఎన్‌డిఎ పాలనలాగా అన్ని పార్టీలు బాధ్యతతో వ్యవహరించాల్సి ఉంది. ఆనాటి పాలకుల దూరదృష్టి లోపం కారణంగా మనకు వారసత్వంగా వచ్చిన సకల అవలక్షణాలు ప్రజలను ఇంకా దరిద్రంలోనే ముంచెత్తుతున్న వేళ పాలకులు గతాన్ని నెమరేసుకుని ముందుకు సాగాల్సిన వేళ ఇది. ఇంతకాలం ఎక్కడ లోపం ఉందో గుర్తించి అవలోకనం చేసుకోవాలి. ఆత్మపరిశీలన చేసుకోవాలి. విద్యావైద్యరంగం ఎందుకు వెనకబడి ఉందో తెలుసు కోవాలి. ఆహారధన్యాలను ఇంకా ఎందుకు దిగుమతి చేసుకుంటున్నామో ఆలోచన చేయాలి. రాజకీయ దృక్కోణంలో కాకుండా అభివృద్ది కోణంలో పాలన చేయాల్సిన విషయాన్ని పాలకులు వంటబట్టించు కోవాల్సి ఉంది. గ్రామాలను విద్య,వైద్యపరంగా పూర్తిస్థాయిలో అభివృద్ది చెందేలా చేయాలి. దేశీయంగా ఉన్న సాంకేతికతను ఉపయోగించుకుని యువతను స్వయం సమృద్దికి సన్నద్దం చేయాలి. వ్యవసాయం, అనుబంధ రంగాలను అభివృద్ధి చేస్తే ఈ దేశం ఇతర దేశాలకు ఆహారధాన్యాలను ఎగుమతి చేయగలదు. సింగపూర్, మలేషియా తదితర చిన్నదేశాలను ఆదర్శగా తీసుకుని ఆయా రాష్ట్రాలు స్వయం సమృద్ది సాధించే ప్రణాళికలతో సాగాల్సిన అవసరాన్ని గుర్తించాలి. ప్రజలు సంపూర్ణత సాధించేలా పథకాలు అమలు కావడం లేదు. ఐదేళ్లు అధికారంలోకి రాగానే మరో ఐదేళ్లు గద్దెపై ఉండడ మెలా అన్న ఆలోచన చేయడం వల్లనే భారత్ కూడా ఇంకా దారిద్య్రం, నిరక్షరాస్యత, వసతుల కొరత, ఆహారధాన్యాల కొరతతో అలమటి స్తోంది. ఇదంతా పాలకుల దృష్టి లోపంగా చూడాలి. నిజానికి దేశంలో నల్లధనం, అవినీతి పోవాలంటే రాజకీయ పార్టీల నుంచే ప్రక్షాళన మొదలవ్వాలి. నల్లధనం రూపంలో రాజకీయ పార్టీలు విరాళాలు తీసుకుని ఓటర్లను కొనుగోలు చేయడానికి వాడుతున్నాయి. ఎన్నికలు అయ్యాక తగిన మెజారిటీ సమకూరని సందర్భాలలో ఎమ్మెల్యేలు లేదా ఎంపీల బేరసారాల కోసం ఈ నల్లధనాన్నే వాడుతున్నారు. వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు రాజకీయ పార్టీలకు ఇస్తున్న విరాళాలలో అత్యధిక భాగం నల్లడబ్బు రూపంలోనే ఉంటోంది. ఈ పరిస్థితిని నివారించకుండా ఎన్ని సంస్కరణలు చేసినా ఫలితం ఉండదు.ఎన్నికల్లో ఆయా పార్టీలు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న వైనం చూస్తున్నాం. ఇంతగా డబ్బు ఎక్కడి నుంచి వస్తుందో గమనించాలి. రాజకీయాలు చేసేవారికి వస్తున్న డబ్బుపై దృష్టి సారించాలి. అన్నిరంగాల్లో మనం ముందంజ వేయాల్సిన దశలో ఇంకా దిగుబడులపై ఆధారపడుతూ ఎగుమతుల విషయంలో లక్ష్యం లేకుండా సాగుతున్నాం. మనం చేపట్టిన సంస్కరణలు ఫలితాలు ఇవ్వడం లేదన్న విషయాన్ని గుర్తించడం లేదు. ఎన్నికలలో డబ్బు అవసరం లేకుండా సంస్కరణలు తీసుకు రాకుండా ఎన్ని చర్యలు తీసుకున్నా లాభం లేదు. రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యం అధికారమే కనుక, ఆ అధికారం కోసం ఎంతకైనా తెగబడతాయని ఈ 75 ఏళ్లలో నిరూపితం అయ్యింది. నీతి ఆయోగ్‌ను బలోపేతం చేస్తూ రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని ఉమ్మడిగా ముందుకు సాగాల్సి ఉంది. అప్పుడే దేశం అభివృద్ది సాధిస్తుందని గుర్తించాలి.

# రిజర్వేషన్ల రద్దు ప్రచారంతో దెబ్బతీసిన కాంగ్రెస్

## సమర్థంగా తిప్పికొట్టడంలో బిజెపి వైఫల్యం

న్యూఢిల్లీ,జూన్5(ప్రజామంటలు):
సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి ఎన్‌డికు గట్టి పోటీని ఇచ్చింది. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యంలో మోడీ ద్వయం అన్నీ మరచి రాజకీయాలు చేశారు. ఎదుటి పార్టీలను ఆర్థికంగా దెబ్బతీయడం, వారిని కేసుల్లో ఇరికించి లోపల పెట్టడం వంటటి దుశ్చర్యలను ఇకనైనా మానుకోవాలి. పార్టీలను చీల్చడం, ప్రభుత్వాలను కూల్చడం జరగకుండా చూసుకోవాలి. సంకీర్ణ పార్టీలు కూడా బాధ్యతగా నడుచుకోవాలి. ఎన్నికల్లో ఓటమికి గల అంశాలను బిజెపి విశ్లేషించుకుని ముందుకు సాగితే మంచిది. ప్రధానంగా యూపీ, మహారాష్ట్ర, బంగాల్‌లో బీజేపీకి గట్టిపోటీ ఇచ్చింది. ఈ మూడు రాష్ట్రాలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లోనూ బీజేపీపై అనేక అంశాలు ప్రభావం చూపి నప్పటికీ.. ప్రధానంగా రిజర్వేషన్ల అంశం వెంటాడింది. దేశంలో ఆదివాసీలు, దళితుల జనాభా ఎక్కువ కాగా.. గత రెండు ఎన్నికల్లోనూ ఆ రెండు సామాజిక వర్గాలు బీజేపీకి మద్దతు ఇచ్చాయి. కానీ.. ఈ దఫా ఎన్నికలకు ముందు కొంతమంది బీజేపీ నేతలు రిజర్వేషన్లపై చేసిన కామెంట్స్ విపక్షాలకు ప్రాణం పోశాయి. రాజ్యాంగాన్ని మార్చివేస్తామన్న బీజేపీ నేతల మాటలను ప్రధాన అస్త్రంగా మార్చుకున్నాయి. రిజర్వేషన్లను రద్దు అంశాలన్ని ఇండి కూటమి మారుమూల ప్రాంతాల్లోకి బలంగా తీసుకెళ్లింది. దాంతో.. తమ రిజర్వేషన్లపై బీజేపీ ప్రభావం చూపిస్తుందన్న ఆందోళనతో ఆ పార్టీకి వ్యతిరేకంగా ఓట్లు వేసినట్లు తెలుస్తోంది. అయితే.. కాంగ్రెస్ విమర్శలను ప్రధాని మోదీతోపాటు అగ్రనేతలు తిప్పికొట్టినా పార్టీ యంత్రాంగం ఆయా వర్గాల్లోకి తీసుకెళ్లడంలో విఫలమైంది. పార్టీ వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడం, భారత రాజ్య వ్యవస్థ అప్రజాస్వామిక స్వభావం, లోపభూయిష్టమైన ఆర్థికాభివృద్ధి నమూనా, మన అస్తిత్వ ప్రాకృతిక ప్రాతిపదికల విధ్వంసం... ఈ సమస్యల మూలాలు మన రిపబ్లిక్ నిర్మాణ వ్యవస్థల్లో ఉన్నాయి. వాటికి ప్రధాన బాధ్యత దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీదే. అయితే 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తరువాత అవి మరింతగా విషమించాయి. పర్యవసానంగా దేశ పురోగతి బాగా కుంటువడింది. గవర్నర్ వ్యవస్త వివాదాస్పదంగా మారింది. ఇందిరాగాంధీ హయాంలో అధికరణ 356ను తరచుగా ఉపయోగించడం జరిగిందని కూడా బీజేపీ శ్రేణులు ఫిర్యాదు చేస్తుంటాయి. అయితే బీజేపీయేతర పార్టీల ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శత్రుత్వ భావంతో వ్యవహరించడం జరిగింది. ఇప్పుడది మానుకోవాలి. బీజేపీ పాలనలో లేని రాష్ట్రాల న్యాయబద్ధ హక్కులను ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పూర్తిగా ఉపేక్షిస్తున్నారు. గవర్నర్లుగా నియమితులయిన పెద్ద మనుషులు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను చికాకు పెట్టేలా చీటికీ మాటికీ అనేక అవరోధాలు కల్పిస్తున్నారు. ఇదిలావుంటే.. ముస్లిం రిజర్వేషన్ల రద్దు నినాదంతోనూ బీజేపీ భారీ మూల్యం చెల్లించుకున్నట్లే తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రధాని మోదీ, అమిత్ షా సహా పలువురు బీజేపీ అగ్ర నేతలంతా తాము మళ్లీ అధికారంలోకి వచ్చాక.. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామంటూ పెద్దయెత్తున ప్రచారం చేశారు. ఎక్కడికి వెళ్లినా.. ఏ సభలో మాట్లాడిన.. బీజేపీ అగ్ర నేతలంతా ముస్లిం రిజర్వేషన్ల రద్దు చేస్తామని ఘంటాపథంగా చెప్పడంతో ఆయా వర్గాల్లో భయాందోళన నెలకొంది. దాంతో.. ముస్లిం వర్గాలన్నీ బీజేపీకి వ్యతిరేకంగా ఓటింగ్ చేసినట్లు సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. దానికి.. యూపీ, మహారాష్ట్ర, బంగాల్‌లో సీట్లు తగ్గడమే నిదర్శనమని అంచనా వేస్తున్నారు. ముస్లిం రిజర్వేషన్ల రద్దు నినాదంతో బీజేపీకి మేలుకంటే కీడే ఎక్కువ జరిగిందని చెప్పుకొస్తున్నారు. రిజర్వేషన్లకు ఎక్కడ నష్టం వాటిల్లుతుందోనని భావించిన ఆయా వర్గాలు.. బీజేపీకి వ్యతిరేకంగా ఓట్లు వేయడం.. కాంగ్రెస్‌కు ప్లస్ పాయింట్‌గా మారింది. ఇంకా చెప్పాలంటే.. యూపీలో కాస్త ముస్లిం ఓటర్లు ఎక్కువ. గత ఎన్నికల్లో యూపీలోని మెజార్టీ ముస్లింలు బీజేపీని ఆదరించారు. గంపగుత్తగా కమలం పార్టీ ఖాతాలో ఓట్లు వేశారు ముస్లింలు. కానీ.. ఈ ఎన్నికల్లో ఎప్పుడైతే.. ముస్లిం రిజర్వేషన్ల రద్దు నినాదాన్ని బీజేపీ భుజానకెత్తుకుందో అప్పటినుంచి ఆయా వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ క్రమంలో.. గతంలో బీజేపీకి ఓట్లు వేసిన ముస్లిం వర్గాలు.. ఈ సారి కాంగ్రెస్ ఆధ్వర్యంలోని.. ఇండి కూటమి వైపునకు మళ్లారు. దాంతో.. టా÷–గ్గ÷ట్ 400 సీట్లు అని ప్రచారం చేసిన బీజేపీ.. కనీసం 300 మార్క్‌ను కూడా దాటలేకపోయిందని చెప్పొచ్చు. యూపీ, బెంగాల్, మహారాష్ట్రలో ముస్లిం ఓటర్లు ఎక్కువ ఉండగా.. అయా రాష్టాల్లో బీజేపీ అనుకున్న రేంజ్‌లో సీట్లు సాధించలేకపోయింది.

# కేవలం 48 ఓట్లతో విజయం

## షిండే వర్గం అభ్యర్థి రికార్డు



ముంబై,జూన్5(ఆర్ఎన్ఎ):
ఈ ఎన్నికల్లో కొందరు భారీ మెజారిటీతో విజయం సాధిస్తే.. మరికొందరు స్వల్ప మెజారిటీతో గ్టటెక్కారు. మహారాష్ట్రలో ఓ అభ్యర్థిని కేవలం 48 ఓట్ల తేడాతో విజయం వరించింది. మహారాష్ట్రలోని ముంబయి నార్త్‌వెస్ట్ లోక్‌సభ స్థానం నుంచి ఏక్‌నాథ్ శిండే వర్గం శివసేన పార్టీ నుంచి రవీంద్ర దత్తారామ్ వైకర్ పోటీ చేశారు. ఉద్ధవ్ ధాక్రే శివసేన (యూబీటీ) నుంచి అన్మోల్ కీర్తికర్ నిలబడ్డారు. వీరి మధ్య ఆద్యంతం గెలుపు ఊగిసలాడింది. చివరకు 48 ఓట్ల తేడాతో ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన రవీంద్ర దత్తారామ్ విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో దత్తారామ్‌కు 4,52,644 ఓట్లు రాగా.. ప్రత్యర్థి అన్మోల్‌కు 4,52,596 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ నోటాకు 15,161 ఓట్లు పడటం గమనార్హం. ఆ తర్వాత కేరళలోని అత్తింగళ్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి అడ్వొకేట్ అదూర్ ప్రకాశ్ తన సమీప ప్రత్యర్థిపై 684 ఓట్లతో నెగ్గారు.ప్రకాశ్‌కు 3,28,051 ఓట్లు రాగా.. 3,27,367 ఓట్లతో సీపీఎం అభ్యర్థి వీ జాయ్ రెండో స్థానంలో నిలిచారు. ఇక్కడ నోటాకు 9,791 ఓట్లు పోలయ్యాయి. ఒడిశాలోని జయపురంలో బీజేపీ అభ్యర్థి రబీంద్ర నారాయణ్ బెహరా (5,34,239 ఓట్లు).. తన సమీప బిజూ జనతాదళ్ అభ్యర్థి శర్మిష్ఠా సేథి (5,32,652)పై 1,587 ఓట్లతో విజయం సాధించారు. ఇక్కడ నోటాకు 6,788 ఓట్లు పడ్డాయి. రాజస్థాన్‌లోని జైపూర్ రూరల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి అనిల్ చోప్రా (6,16,262).. బీజేపీ అభ్యర్థి రాజేంద్ర సింగ్ (6,17,877 ఓట్లు) చేతిలో 1,615 ఓట్లతో ఓడిపోయారు. ఇక్కడ కూడా మెజార్టీ కంటే నోటాకే అత్యధికంగా 7,519 ఓట్లు పోలయ్యాయి. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ స్థానంలో బీజేపీ అభ్యర్థి భోజ్‌రాజ్ నాగ్ (5,97,624).. తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి బీరేశ్ ఠాకుర్ (5,95,740)పై 1,884 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఇక్కడ నోటాకు ఏకంగా 18,669 ఓట్లుపడ్డాయి.

# బిజెపిని దెబ్బకొట్టిన యూపి

## సీట్లను కొల్లగొట్టిన ఇండియా కూటమి

## కొత్త భాగస్వాముల కోసం చూపు



లక్నో, జూన్5(ప్రజామంటలు):
బీజేపీ ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉత్తరప్రదేశ్ ప్రజలు ఈసారి ఆ పార్టీకి చేదు ఫలితాలను మిగిల్చారు. రామాలయ నిర్మాణం కూడా రక్షించలేక పోయింది. యూపిలో ముస్లింలు, యాదవులు, ఎస్సీలు, ఎస్టీలు రిజర్వేషన్ల భయంతో వ్యతిరేకంగా ఓటేశారని అంచనా వేస్తున్నారు. యోగి పాలన భేషుగ్గా ఉన్నా ప్రజలకు కొత్త భయాలు వెన్నాడాయని అంటున్నారు. దేశంలోనే అత్యధిక లోక్‌సభ స్థానాలు కలిగిన రాష్ట్రంలో బీజేపీ భారీగా సీట్లు కోల్పోయింది. యూపీలోని మొత్తం 80 నియోజకవర్గాలకు గానూ బీజేపీ 2014లో 71 స్థానాలను, 2019లో 62 స్థానాలను గెలుచుకున్నది. ఈ ఎన్నికల్లో మాత్రం బీజేపీ 74 స్థానాల్లో పోటీ చేసి 33 స్థానాలను మాత్రమే గెలుచుకోగలిగింది. సమాజ్‌వాదీ, కాంగ్రెస్ పార్టీ పొత్తు ఇక్కడ బీజేపీ సీట్లకు భారీగా గండి కొట్టింది. అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ అనూహ్యంగా పుంజుకున్నది. అయోధ్య రామమందిర నిర్మాణం బీజేపీకి రాజకీయంగా లాభం చేకూర్చలేదు. ఆ పార్టీ గొప్పగా చెప్పుకున్న యోగి ఆదిత్యనాథ్ బుల్డోజర్ పాలసీ బెడిసికొట్టింది. రాష్ట్రం నుంచే పోటీ చేసినప్పటికీ మోదీ మ్యాజిక్ ఈసారి పని చేయలేదు. అప్నాదల్(సోనేవాల్), ఆర్ఎల్‌డీ, సుహల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ, నిషాద్ పార్టీలతో పొత్తు కుదుర్చుకొని, సామాజిక సమీకరణాలను అనుకూలంగా మార్చుకునేందుకు కమలం పార్టీ చేసిన ప్రయత్నాలు కూడా అంతగా ఫలించలేదు. ఉత్తరప్రదేశ్‌లో పదేండ్ల తర్వాత మొదటిసారి బీజేపీ దూకుడుకు బ్రేకులు పడ్డాయి. సమాజ్‌వాదీ, కాంగ్రెస్ పార్టీల పొత్తు ఇండియా కూటమికి సత్ఫలితాలను ఇచ్చింది. 2014లో కేవలం 5 స్థానాలు, 2019లో 5 స్థానాలకే పరిమితమైన సమాజ్‌వాదీ పార్టీ ఈసారి 62 స్థానాల్లో పోటీ చేసి ఏకంగా 37 స్థానాలను కైవసం చేసుకుంది. 2019లో ఒకే ఒక్క స్థానానికి పరిమితమై ఉనికి కోల్పోయే స్థితిలో ఉన్న కాంగ్రెస్ ఈసారి ఆరు స్థానాలను గెలుచుకుంది. గత ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఓడిపోయిన అమేథీలో ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి కిశోరీలాల్.. స్మృతి ఇరానీని ఓడించారు. ఇకపోతే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంతగా బలం ఇండియా కూటమికి లేదు. అయినా రాయి వేదద్దామన్న ఆలోచనతో పావులు కదుపుతోంది. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైనన్నీ సీట్లు సాధించినా.. ఏ పార్టీకి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు


బండి సంజయ్


ధర్మపురి అర్వింద్


ఈటల రాజేందర్


రఘు నందన్‌రావు

# ఎమ్మెల్యేగా ఓడి, మోదీ చరిష్మాతో గెలిచిన ఎంపీలు

జగిత్యాల జిల్లా ప్రతినిధి జూన్ 05 (ప్రజామంటలు):
ఓడలు బళ్లు అవుతాయి.. బళ్లు ఓడలవుతాయి అనే సామెత వీరికి సరిగ్గా సరిపోతోంది. 2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పాలైనా, ఆర్నెల్లు తిరక్క ముందే లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించి సత్తా చాటారు. రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పాలని భావించిన ఈ నేతలను తిరస్కరించిన ప్రజలు ఏకంగా ఇప్పుడు పార్లమెంట్‌కు పంపించారు. వీరిలో ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు కాగా, మరో ఇద్దరికి ఎమ్మెల్యేలుగా అనుభవం ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ దీటుగా ఎదుర్కొని విజయబావుటా ఎగురవేశారు. ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మాకు తోడు .. కేంద్రంలో అధికారంలోకి వచ్చే పార్టీని గెలిపిస్తే అభివృద్ధి సాధ్యమని ఓటర్లకు వివరించగలిగారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ దీటుగా ఎదుర్కోగలిగారు.

**పడి లేచిన కెరటం.. బండి సంజయ్..**

పడి లేచిన కెరటంలా లోక్‌సభ ఎన్నికల్లో బండి సంజయ్ ఘన విజయం సాధించారు. రాజకీయంగా అనేక ఒడిదొడుకులు ఎదుర్కొన్న ఆయన.. నవంబరులో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. సమీప ప్రత్యర్థి భారాస అభ్యర్థి గంగుల కమలాకర్ చేతిలో ఓటమి పాలయ్యారు. అయినా, ఏమాత్రం పట్టు సడలకుండా నియోజవర్గంలోనే ప్రజలకు అందుబాటులో ఉన్నారు. స్వల్ప కాలంలోనే తిరిగి పుంజుకొని లోక్‌సభ ఎన్నికల్లో 2.12లక్షలకు పైగా ఓట్ల మెజార్టీతో బండి సంజయ్ గెలుపొందారు.

**నిజామాబాద్‌లో గెలిచిన అర్వింద్..**

ధర్మపురి అర్వింద్ నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందారు. రాజకీయ ప్రత్యర్థులపై తనదైన శైలిలో విరుచుకుపడే నేతగా గుర్తింపు ఉన్న ఆయన.. అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. సమీప ప్రత్యర్థి, భారాస అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ చేతిలో 10,300 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న అర్వింద్ లోక్‌సభ ఎన్నికలు వచ్చేసరికి వ్యూహం మార్చారు. మోదీ చరిష్మా తో తన వ్యూహానికి పదును పెట్టారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి గట్టి పోటీ ఇచ్చినప్పటికీ 1.13లక్షలకు పైగా మెజార్టీతో అర్వింద్ విజయం సాధించారు.

**25 ఏళ్ల తర్వాత మెదక్ గడ్డపై కాషాయ జెండా**

మెదక్ జిల్లా దుబ్బాక అసెంబ్లీ నుంచి పోటీ చేసిన రఘునందన్‌రావు భారాస అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి చేతిలోఓటమి పాలయ్యారు. అయినా, ఆయనపై నమ్మకంతో భాజపా అధిష్ఠానం మెదక్ టికెట్ ఇచ్చింది. న్యాయవాది, మంచి వాగ్దాటి కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందిన రఘునందన్‌ను లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు ఆదరించారు. భారాస, కాంగ్రెస్ అభ్యర్థులను దీటుగా ఎదుర్కొని మెదక్ గడ్డపై 25 ఏళ్ల తర్వాత భాజపా జెండా రెప రెపలాడించారు.

**ఈటలకు కలిసొచ్చిన సుదీర్ఘ రాజకీయ అనుభవం:**

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లోపోటీ చేసిన ఈటల రాజేందర్ భారాస అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. దీంతో ఈటల పని అయిపోయిందని అంతా అనుకున్నారు. కానీ సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఈటల లోక్‌సభ ఎన్నికలకు వచ్చే సరికి మినీ ఇండియాగా పేరున్న మల్కాజిగిరి నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు. తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి పై 3.86 లక్షల ఓట్ల మెజారిటీతో ఎంపీగా జయకేతనం ఎగురవేశారు. మొదటి రౌండ్ నుంచి ఆధిపత్యం కనబర్చారు. ఏ రౌండ్‌లోనూ కాంగ్రెస్ అభ్యర్థి ఈటలకు పోటీ ఇవ్వలేకపోయారు.

# కోలుకున్న స్టాక్ మార్కెట్లు

## ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పాటు ప్రకటనతో కళకళ

ముంబయి,జూన్5 (ప్రజామంటలు):



సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వెలువడడంతో భారీ నష్టాలు మూటగట్టుకున్న దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం కోలుకోవడమే కాకుండా భారీ లాభాలను నమోదు చేశాయి. చరిత్రలోనే అతిపెద్ద నష్టంతో షాక్‌లోకి జారుకున్న మదుపరికి.. ఓ విధంగా కోలుకునే అవకాశం లభించింది. భాజపాకు సొంతంగా మెజారిటీ రాకపోయినా.. మరోసారి ప్రభుత్వ ఏర్పాటుకు పెద్దగా ఇబ్బంది ఉండకపోవడంతో సూచీలు రాణించాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 2,500 పాయింట్ల మేర లాభపడి.. తిరిగి తన 74వేల మార్కును నిలబెట్టుకుంది. నిఫ్టీ 22,600 పాయింట్ల ఎగువన ముగిసింది. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ వంటి షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి.

సెన్సెక్స్ ఉదయం 73,027.88 (క్రితం ముగింపు 72,079.05) దాదాపు వెయ్యి పాయింట్ల లాభంతో ప్రారంభమైంది. కాసేపు ఒడుదొడుకులు ఎదుర్కొన్నప్పటికీ.. తర్వాత లాభాల్లోనే కొనసాగింది. కేంద్రంలో మరోసారి అధికారం ఏర్పాటు దిశగా ఎన్డీయే అడుగులు వేస్తుండడంతో సూచీలు భారీ లాభాల్లోకి వెళ్లాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ ఇంట్రాడేలో 74,534.82 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 2,303.19 పాయింట్ల లాభంతో 74,382.24 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 778.50 పాయింట్ల లాభంతో 22,663 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.37గా ఉంది. సెన్సెక్స్‌లో అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ÷నాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు ప్రధానంగా రాణించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 77.39 డాలర్లకు చేరగా.. బంగారం 2350 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఔ÷ూఇ) అరుదైన ఘనత నమోదు చేసింది. కేవలం ఒక్క ట్రేడింగ్ రోజులోనే అత్యధిక లావాదేవీలు జరిపి ప్రపంచ రికార్డును బద్దలు కొట్టింది. ఈ విషయాన్ని ఎన్ఎస్ఈ ఎండీ, సీఈఓ ఆశిష్‌కుమార్ చౌహాన్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. 'బుధవారం (జూన్ 5) ఉదయం 9:15 నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు 6 గంటల 15 నిమిషాల పాటు సాగిన ట్రేడింగ్ సెషన్‌లో ఎన్ఎస్ఈ 1971 కోట్ల (19.71 బిలియన్) ఆర్డర్‌లను ప్రాసెస్ చేసింది. 28.05 కోట్ల (280.55 మిలియన్లు) ట్రేడ్‌లను నిర్వహించింది. ఒక్క రోజులోనే అత్యధిక లావాదేవీలు నిర్వహించి కొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది' అని పేర్కొన్నారు.

# అఖిలేష్ జిల్లా నుంచి ఏడుగురు ఎంపిలు

## వివిధ స్థానాల నుంచి గెలుపొందిన నేతలు

లక్నో,జూన్5( (ప్రజామంటలు):
ఎంతో ఉత్కంఠ రేపిన ఎన్నికల సార్వత్రిక ఎన్నికల పర్వం ముగిసింది. వార్ వన్ సైడే అనుకున్న వారందరికీ బిగ్ షాక్ ఇచ్చాయి ఎలక్షన్ రిజల్ట్స్. ఈ ఎన్నికలు దేశ రాజకీయ చరిత్రలోనే ఎన్నో రికార్డులకు కేరాఫ్‌గా మారింది. అలాంటి రికార్డులలో ప్రత్యేకమైన ఒక అంశం అందరినీ ఆకర్శిస్తోంది. సాధారణంగా ఒక జిల్లాలో అనేక మంది రాజకీయ నాయకులు ఉంటారు. వారిలో ఎవరో కొందరు మాత్రమే పదవులను చేపట్టే అవకాశం ఉంటుంది. కానీ, ఈ జిల్లాకు చెందిన నాయకులు మాత్రం.. దేశాన్నే ఆశ్చర్యపరిచారు. ఎందుకంటే.. ఈ జిల్లాకు చెందిన కీలక నాయకులంతా ఎంపీలుగా గెలుపొందారు. ఒకరు కాదు ఇద్దరు కాదు.. ఏకంగా ఏడుగురు నాయకులు ఎంపీలుగా గెలుపొంది పార్లమెంట్‌లో అడగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల కమిషన్ వివరాల ప్రకారం.. తొలిసారిగా జిల్లాకు చెందిన ఏడుగురు నాయకులు లోక్‌సభ ఎన్నికల్లో అద్వితీయ విజయాన్ని నమోదు చేశారు. ఈ నేతలంతా ఉత్తరప్రదేశ్‌లోని వివిధ లోక్‌సభ స్థానాల నుంచి గెలుపొందారు. అయితే, వీరందరూ సమాజ్‌వాదీ పార్టీకి చెందిన వారే కావడం విశేషం. అందులోనూ ఇటావా జిల్లాకు చెందిన వారు కావడం మరింత విశేషం. 1999 తరువాత ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ అద్భుత ప్రదర్శన చేసి ఈసారి 37 లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకుంది. ఈ విజయం అఖిలేష్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీతో పాటు.. కాంగ్రెస్‌కు కూడా ఎంతో కీలకంగా మారింది. అయితే, ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఇటావాకు చెందిన ఏడుగురు నేతలు అపూర్వ రికార్డ్ నమోదు చేశారు. ఇటావా నుంచి జితేంద్ర దోహ్రే, కనౌజ్ నుంచి ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్, మెయిన్‌పురి నుంచి డింపుల్ యాదవ్, అజంఘడ్ నుంచి ధర్మేంద్ర యాదవ్, బదౌన్ నుంచి ఆదిత్య యాదవ్, ఫిరోజాబాద్ నుంచి అక్షయ్ యాదవ్, ఎటా నుంచి దేవేశ్ శాక్యా గెలుపొందారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో యాదవ కుటుంబానికి చెందిన ఐదుగురు అభ్యర్థులు విజయం సాధించారు. ఈ దఫా ఎన్నికల్లో అఖిలేష్ తన కుటుంబ సభ్యులకు మినహా యాదవ అభ్యర్థులకు ఎక్కువగా టిక్కెట్ ఇవ్వలేదు. అంతేకాదు.. నలుగురు ముస్లిం అభ్యర్థులను మాత్రమే రంగంలోకి దించారు. టికెట్ దక్కిన నేతలంతా ఎన్నికల్లో గెలుపొందడం విశేషం. రాంపూర్, కైరానా, మొరాదాబాద్, సంభాల్ స్థానాల్లో సమాజ్ వాదీ పార్టీ ముస్లిం అభ్యర్థులను నిలబెట్టింది. వీరంతా గెలుపొందారు.

# గ్రూప్-1 ప్రిలిమ్స్ పక్కడ్బందీ గా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

### పరీక్ష కేంద్రాల సూపరిండెంట్లు, అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమంలో దిశానిర్దేశం






హనుమకొండ జూన్ 05 (ప్రజామంటలు):
వడ్డేపల్లి లోని ప్రభుత్వ పింగళి మహిళా డిగ్రీ కళాశాలలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాల సూపరిండెంట్లు, అబ్జర్వర్లకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 9న జరగనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను అధికారులు పక్కడ్బందీ గా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు.జిల్లాలో 17 కేంద్రాల్లో 9168 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారని, ప్రతి కేంద్రం సీసీ కెమెరా నిఘాలో ఉంటుందన్నారు. డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, రూట్ అధికారులు, ఇన్విజిలెటర్లను నియమించామని, ఈ సారి బయోమెట్రిక్ హాజరు విధానం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ నెల 9న ఉదయం 9 గంటల వరకే పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలని పేర్కొన్నారు. ఉదయం 10:30 గంటల నుంచి ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. గతంలో జరిగిన అవకతవకల దృష్ట్యా ఏ ఒక్క చిన్న తప్పు కూడా జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షకు రెండు రోజుల ముందే సెంటర్ల దగ్గర సూచనల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మొబైల్ ఫోన్లతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రాల్లో అనుమతి లేదని తెలిపారు. నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పరీక్ష రాసే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ చంద్రమౌళి, పరీక్ష కేంద్రాల సూపరిండెంట్లు, అబ్జర్వర్లు పాల్గొన్నారు.

# క్రికెట్ ఆడుతూ.. గుండెపోటుతో యువకుడు మృతి

నిజామాబాద్,జూన్5 (ప్రజామంటలు):
గుండెపోటు అంటే ఒకప్పుడు వయసు పైబడిన వాళ్లకు మాత్రమే వచ్చేది. కానీ ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా పసి పిల్లల నుంచి పెద్ద వాళ్ల దాకా ఎవరికి ఎప్పుడు వస్తుందో చెప్పడం కష్టమైపోయింది. అప్పటిదాకా ఆడుతూ పాడుతూ ఉన్న వాళ్లు ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోతున్నారు. ఇలాంటి ఘటనలను ఇప్పటికే మనం చాలానే చూస్తూనే ఉన్నాం. తాజాగా నిజామాబాద్‌లో ఓ యువకుడు క్రికెట్ ఆడుతూ కుప్పకూలిపోయాడు. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గౌతమ్‌నగర్‌కు చెందిన యువకుడు బుధవారం ఉదయం క్రికెట్ ఆడేందుకు బయటకు వెళ్లాడు. అమ్మ వెంచర్‌లో క్రికెట్ ఆడుతుండగా ఛాతిలో నొప్పి వస్తుందని కిందపడిపోయాడు. ఇది గమనించిన స్నేహితులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే విజయ్ మృతిచెందాడు.





# నటి హేమ రేవ్ పార్టీ వ్యయహారం

## మా సభ్యత్వం రద్దు చేసిన మంచు విష్ణు

బెంగళూరు,జూన్5 (ప్రజామంటలు):
రేవ్ పార్టీ కేసులో సినీ నటి హేమను బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేసారు. ఈ కేసులో హేమ డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారనైనట్లు పోలీసులు స్పష్టం చేశారు. హేమ విషయంలో పోలీసులు బయటపెట్టిన ఆధారాల ప్రకారం యాక్షన్ ఉంటుందంటూ గతంలో మా అసోసియేషన్ ప్రెసిడెంట్ మంచు విష్ణు ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా హేమ అంశంపై చర్చించిన 'మా' కమిటీ..

నటి హేమ మా సభ్యత్వం సస్పెండ్ చేయడానికి అభిప్రాయాలను కోరారు. దీనిపై మా అసోసియేషన్ గ్రూప్‌లో మంచు విష్ణు మెసేజ్ చేశారు. ఈ మేరకు హేమ సభ్యత్వం రద్దుపై అభిప్రాయాలను సేకరించిన మంచు విష్ణు.. అధిక మంది హేమను సస్పెండ్ చేయడంపై పాజిటివ్‌గా స్పందించినట్లు తెలిపారు. దీంతో ఆమెకు క్లీన్ చీట్ వచ్చేంత వరకు మా అసోసియేషన్‌లో హేమ సభ్యత్వం రద్దు చేయాలని మంచు విష్ణు కీలక నిర్ణయం తీసుకున్నారు. దీనిపై గురువారం మా అధ్యక్షుడు విష్ణు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. కాగా బెంగళూరు నగర శివార్లలో రేవ్‌పార్టీలో పాల్గొన్న దాదాపు 150 మందిని పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో భారీ మొత్తంలో డ్రగ్స్ వినియోగించినట్లు తేలింది. ఈ పార్టీకి మాదకద్రవ్యాలు సమకూర్చారనే ఆరోపణపై ఇప్పటికే సిద్ధిక్, రణధీర్, రాజ్‌భావ అనే వ్యక్తులను కటకటాల వెనక్కినెట్టారు. ఇదే పార్టీకి హాజరైన నటి హేమ తొలుత తాను ఇంట్లోనే ఉన్నానని, రేవ్‌పార్టీలో లేనని పలు వీడియోలు విడుదల చేసింది. ఆ తర్వాత చోటు చేసుకున్న నాటకీయ పరిణామాల దృష్ట్యా నటి హేమ సీసీబీ దర్యాప్తు అధికారుల ఎదుట లొంగిపోయింది. బుర్కా ధరించి చామరాజపేటలోని సీసీబీ కార్యాలయంలోకి చేరుకున్న హేమ.. అధికారులు అడిగిన ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం ఇవ్వకపోవడంతో చివరికి అరెస్టు చేశారు.

# రాహుల్ ఏ సీటును వదులుకుంటారు ?

## ఇప్పుడు దేశవ్యాప్తంగా ఇదే చర్చ

### రాయబరేలిని చెల్లికోసం వదులుకుంటారని టాక్

న్యూఢిల్లీ,జూన్5( (ప్రజామంటలు):



రెండుచోట్ల గెలిచిన రాహుల్ గాంధీ ఏ స్థానం వదులుకుంటారన్నది చర్చగా మారింది. వయనాడ్, రాయబరేలి నుంచి గెలిచిన రాహుల్ ఈ రెంటిలో ఏదో ఒకస్థానం నుంచి రాజీనామా చేయాల్సిందే. ఈ క్రమంలో యాన రాయబరేలికి రాజీనామా చేసి, చెల్లి ప్రియాంకను ఇక్కడ గెలిపించాలని చూస్తున్నట్లు సమాచారం. దీనిపై త్వరలోనే స్పష్టత రానుంది. ఈ సార్వత్రిక ఎన్నికల్లో మెరుగైన పనితీరు కనబరిచిన కాంగ్రెస్.. అనేక చోట్ల అధికార భాజపాకు గట్టిపోటీ ఇచ్చింది. అగ్రనేత రాహుల్ గాంధీ.. వయనాడ్‌తో పాటు రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానాల నుంచి 3లక్షలకు పైగా మెజార్టీతో విజయం సాధించారు. దీంతో ఆయన ఏదో ఒక స్థానానికే ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కుటుంబ కంచుకోటగా ఉన్న రాయ్‌బరేలీకి పరిమితమవుతారా? లేక ఆపన్నహస్తం అందించిన వయనాడ్ నుంచే కొనసాగుతారా?అనే విషయంపై ఆసక్తి నెలకొంది. వయనాడ్ లోక్‌సభ స్థానం పరిధిలోని మూడు జిల్లాల్లో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇందులో వయనాడ్ జిల్లాలో రెండు ఎస్టీ రిజర్వుడ్ కాగా మలప్పురంలో ఒకటి ఎస్సీ రిజర్వుడ్ స్థానం ఉంది. ఇక్కడ ముస్లిం జనాభా కూడా ఎక్కువే. కోజికోడ్ జిల్లాలో క్రైస్తవ ఓటు బ్యాంకు ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ ఆధారిత కుటుంబాలు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో పంటలకు మద్దతు ధర, పంట నష్టం, గిరిజనుల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, మౌలిక సదుపాయాలు వంటివి ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఇక్కడ బలంగా ఉండటంతోపాటు.. జాతీయ స్థాయిలో విపక్ష కూటమి తరఫున ప్రధానమంత్రి అభ్యర్థి రాహుల్ అయ్యే అవకాశాలున్నాయంటూ స్థానిక కాంగ్రెస్ శ్రేణులు ప్రచారం చేశాయి. చేసిన అభివృద్ధి, స్థానిక సమస్యలను జాతీయ స్థాయికి తీసుకెళ్లడం వంటివి ప్రస్తావించిన కాంగ్రెస్.. కల్పెట్టాలో ఏప్రిల్ 3న రాహుల్ నిర్వహించిన రోడ్ షో ద్వారా దేశవ్యాప్త దృష్టిని ఆకర్షించింది. గతంలో మిత్రపక్షంగా ఉన్న ఐయూఎంఎల్ జెండాలను ప్రదర్శించడం ఇబ్బందికరంగా మారడంతో.. ఈసారి పార్టీ జెండాలను పక్కనపెట్టి రంగు రంగుల బెలూన్లను ప్రదర్శించి వివాదం లేకుండా చూసుకోవడం వంటివి కలిసొచ్చిన అంశంగా విశ్లేషకులు చెబుతున్నారు. భాజపా, వామపక్ష పార్టీ బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపాయి. సీపీఐ నుంచి అన్నీరాజా, భాజపా నుంచి ఆ రాష్ట్ర అధ్యక్షుడు కే సురేంద్రన్ పోటీలో కొనసాగారు. ఈ నియోజకవర్గం గురించి పట్టించుకోవడం లేదని రాహుల్ గాంధీపై ప్రత్యర్థులు విమర్శలు చేశారు. ఒకవేళ ఉత్తరాది నుంచి పోటీచేసి గెలిస్తే ఆయన రాయ్‌బరేలీకి వెళ్లిపోతారని కాషాయ పార్టీ ప్రచారం చేసింది. అయినప్పటికీ.. వయనాడ్ నుంచి రెండోసారి 3.64లక్షలకుపైగా ఓట్ల మెజార్టీతో రాహుల్ విజయం సాధించారు. రాయ్‌బరేలీ గత కొన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు కంచుకోటగా కొనసాగుతోంది. 1951 నుంచి ఈ నియోజకవర్గంలో కేవలం మూడుసార్లు మాత్రమే ఆ పార్టీ అభ్యర్థులు ఓడిపోయారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ఫిరోజ్ గాంధీ, సోనియాగాంధీ వంటి అగ్రనేతలు ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహించారు. సోనియా గాంధీ ఇటీవల రాజ్యసభకు ఎన్నిక కావడంతో బరిలో దిగిన రాహుల్.. భారీ మెజార్టీ సొంతం చేసుకున్నారు. రాహుల్ రాయ్‌బరేలీని వదులుకుంటే అక్కడ నుంచి ప్రియాంకాగాంధీ పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ వ్యూహంతోనే ఆమెను సార్వత్రిక ఎన్నికల్లో వేరే చోట నుంచి బరిలో దింపలేదనే వాదనా ఉంది. ఇదే విషయాన్ని ఎన్నికలకు ముందు పరోక్షంగా ప్రస్తావించిన ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్.. ప్రియాంక దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తూ మోదీ అసత్యాలను ఎండగడుతున్నందునే ప్రస్తుత ఎన్నికల్లో పోటీలో ఉంచలేదని అన్నారు. ఎక్కడైనా ఉప ఎన్నిక ద్వారా ఆమె పార్లమెంటుకు వెళ్లవచ్చని జోస్యం చెప్పడం చూస్తుంటే, అది రాయ్‌బరేలీ కావొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# పద్మనాభరెడ్డిగా పేరు మార్చుకుంటా..

## ముద్రగడ పద్మనాభం సంచలన ప్రకటన

అమరావతి,జూన్5 (ప్రజామంటలు): ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో పిఠాపురం నుంచి పోటీ చేసి.. భారీ మెజార్టీతో అఖండ విజయాన్ని అందుకున్నారు జనసేన అధినేత పవన్ కల్యాణ్. ఎన్నికలకు ముందు.. పవన్ కల్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేసి గెలిస్తే.. తన పేరు మార్చుకుంటానని కాపు ఉద్యమ నేత, వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం ఛాలెంజ్ చేశారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ ఊహించని రీతిలో మెజార్టీ సాధించి.. విజయాన్ని అందుకోవడంతో తన పేరును మార్చుకునేందుకు ముద్రగడ పద్మనాభం సిద్ధమయ్యారు. పిఠాపురంలో పవన్ ను ఓడిస్తానని సవాల్ చేసి ఓడి పోయానని, త్వరలోనే తన పేరును పద్మనాభ రెడ్డిగా మార్చుకుంటానని సంచలన ప్రకటన చేశారు. ఈ మేరకు గెజిట్ పబ్లికేషన్ కోసం అంతా సిద్ధం చేసుకున్నట్లు వివరించారు. పవన్ ను ఓడించకపోతే తన పేరును మార్చుకుంటానని శపథం చేసిన ముద్రగడ పద్మనాభం తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నారు.పవన్ కల్యాణ్ ను పిఠాపురంలో ఓడించేందుకు ప్రత్యర్థిగా వంగా గీతను నిలబెట్టిన వైసీపీ.. ఆమెను గెలిపించే బాధ్యతను ముద్రగడ పద్మనాభంకు అప్పగించింది. ఈ క్రమంలోనే ముద్రగడ పవన్ ను ఓడిస్తానని సవాల్ చేశారు.

## వారాసిగూడ లో బీజేపీ శ్రేణుల సంబరాలు

సికింద్రాబాద్ జూన్ 05 (ప్రజామంటలు):



కేంద్రంలో మరోసారి బీజేపీ ఆధ్వర్యంలో ఎన్డీఏ సర్కార్ ఏర్పడుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్ నియోజకవర్గం వారాసిగూడ చౌరస్తాలో బుధవారం బీజేపీ పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. సికింద్రాబాద్ ఎంపీ గా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి విజయం సాధించడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ కార్పొరేటర్ పి. స్వరూప గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. మోదీ జిందాబాద్, జై శ్రీరామ్... అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రవిప్రసాద్ గౌడ్, నాయకులు అజయ్, సతీష్ రాజ్, వేణుగోపాల్, ప్రసాద్, లక్ష్మన్, జగత సేన్, శేఖర్ పాల్గొన్నారు.

## పెద్దల బీసీజీ టీకా తో టీబీ నిర్మూలన జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్

జగిత్యాల జూన్ 05 (ప్రజామంటలు):



పెద్దల బీసీజీ టీకా తో టీబీ వ్యాధి పూర్తి నిర్మూలన సాధ్యమవుతుందని, బిసిజి టీకాపై అధ్యయనానికి రాష్ట్రవ్యాప్తంగా 17 జిల్లాలను ఎంపీక చేయగా జగిత్యాల జిల్లా ఎంపికైందని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక మినీ పద్మనాయక కల్యాణ మండపంలో జిల్లాలోని వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఇతర సిబ్బందికి బీసీజి టికా పై అవగాహన, శిక్షణ, అధ్యయనం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో నిబంధన మేరకు గుర్తించిన వారికే బీసీజి టీకా వేయడం జరుగుతుందని ప్రతి మండలంలో ఇంటింటి సర్వే నిర్వహించి బీసీజీ టికా లబ్ధిదారులను గుర్తిస్తామన్నారు., జిల్లాస్థాయిలో శిక్షణ అనంతరం మండల స్థాయిలో వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఉంటాయని ఆయన పేర్కొన్నారు. బీసీజీ టీకా ఉపయోగాలు, నిర్వహణ తదితర అంశాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధులు డాక్టర్ విష్ణు, ఆదిత్య, అతుల్ నగిమే, ప్రోగ్రాం అధికారులు డా. సమీయొద్దీన్, డా. ఆకుల శ్రీనివాస్, డా. ఎమ్. జైపాల్ రెడ్డి మరియు జిల్లాలోని వైద్యాధికారులు, ఎంఎల్ హెచ్ పి లు, సూపర్ వైజర్స్, సిబ్బంది తదితరులున్నారు.

## పచ్చదనం పరిశుభ్రత వారోత్సవాలు

గొల్లపల్లి జూన్ 05 (ప్రజామంటలు):



గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సాన్ని పురస్కరించుకుని పచ్చదనం పరిశుభ్రత వారోత్సవాలో ఎంపీటీసీ గోవిందు లావణ్య జలపతి ప్రారంభించారు . గ్రామపంచాతి సిబంది గ్రామప్రజల తో ర్యాలీ నిర్వహించి వారితో ప్రతిజ్ఞ చేయించారు ఇట్టి కార్యక్రమంలో ఎంపీవో సురేష్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి జీవన్, బిఎల్ఓ స్వప్న, తిరుమల, ఆశావర్కర్లు లక్ష్మీ, రాధ, పంచాయితీ సిబంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఇందిరా భవన్ లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రెస్ మీట్

జగిత్యాల జూన్ 05 (ప్రజామంటలు):



బీజేపీ పార్టీ రాజకీయ లబ్ధి కొరకు మత విద్వేషాలు రెచ్చగొట్టాలని ప్రయత్నించింది. స్లిం లను బూచిగా చూపి హిందూ ఓట్లలను మభ్యమెట్టి రాజకీయాలు చేశారు. రెండు నెలల్లో 'అబ్కి బార్ చార్ సౌ పార్' ను మూడు వందల లోపు తీసుకువచ్చాం. అదే సమయం లో కాంగ్రెస్ సంఖ్య పెంచుకున్నాం. యుపి లో ఇండియా కూటమే అధ్యదిక స్థానాలు గెలుచుకుంది. దువులకే కాకుండా యావత్ ప్రపంచానికి శ్రీరాముడు ఆదర్శ మూర్తి. కానీ రాజకీయాలకు వాడుకోవడం స్థానికులు జీర్ణించుకోలేక పోయారు. దైవ దూత గా మోడీ ప్రచారం చేసుకోవడం పట్ల నార్త్ ఇండియా జీర్ణించుకోలేదు. నార్త్ ఇండియాలో మోడీ అంటే ఎవరో తెలిసిపోయింది. ఇండియా కూటమి ఈ స్థాయికి రావడం రాహుల్ గాంధీ విజయమే. స్వంతంగా కాంగ్రెస్ 99 సీట్లు సాధించడం సంతోషకరం.అధిక రైతాంగం ఉండే పంజాబ్ లో అప్, కాంగ్రెస్ పోటి పడ్డాయి కానీ బీజేపీ పోటీలో ఉండలేక పోయింది. వ్యవసాయంపై దేశం ఆధారపడి ఉందని, మినిమం సపోర్ట్ ప్రైజ్ అందేలా చూడాలని సూచించాలి. ప్రభుత్వ వైపల్యం ఎండగట్టే విధంగా రాహుల్ పని చేస్తారని ఆశిస్తున్నాం. శత్రువు యొక్క శత్రువు మిత్రుడు లా ఉనికి కాపాడుకోవాల్సిన బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ఓటమి కోసం పని చేసి బిజెపికి అండగా నిలిచారు. త్రిముఖ పోరు కాస్త బీజేపీ, బిఆరెస్ ఒకటి కావడం ద్విముఖ పోరు అయింది. 2023 ఎన్నికల తో పోలిస్తే కాంగ్రెస్ ఓటు షేర్ పెరిగింది. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్వగ్రామంలో కాంగ్రెస్ కు 40 శాతం ఓట్లు షేర్ చేసుకున్నాం... అక్కడ ఓటు బీజేపి కి షేర్ చేసుకోకపోవడం తో మాకు ఓట్లు వచ్చాయి. ఇదే విధంగా జగిత్యాల నియోజక వర్గం లో ఓటింగ్ జరిగితే 40 వేల మెజార్టీ వచ్చేది. మాకు 10 శాతం ఓట్లు పెరిగినా బిఆర్ఎస్ ఓట్లు 16 శాతం బీజేపి కి పోల్ అయినట్లు వివరించారు. జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గం, నిజామాబాద్ పార్లమెంటు ప్రజలకు, కార్యకర్తలకు నా కృతజ్ఞతలు. ఎంపీ అరవింద్ కు చెందిన నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం లో కాంగ్రెస్ కు 16 వేల మెజార్టీ వచ్చింది. రైతాంగం కోసం నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిచేలా కార్యరూపం దాల్చేందుకు, గల్ఫ్ బాధితులకు, బిడి కార్మికుల సమస్యలు తీర్చే బాధ్యత తన పై ఉందన్నారు. ప్రైవేట్ స్కూల్ ఫీజు నియంత్రణ చట్టం తీసుకువచ్చే అవసరం ఉంది. మోడీ సర్కార్ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కూడా ఈడబ్ల్యూఎస్ లో చేర్చాలనీ డిమాండ్. అంశాన్ని రాహూల్ గాంధీ దృష్టికి తీసుకువెళ్తమని చెప్పారు. ఓటమి నా బాధ్యత పెంచింది. చివరి శ్వాస వరకు ప్రజా సేవలో ఉంటా. మరో ఆరు నెలల వరకు శాసన మండలి సభ్యుడిగా సేవా చేస్తా. తదుపరి నాకున్న అనుభవం తో సేవ చేస్తా. నాకు పోటీగా దేవుడిని తెచ్చి ముందు పెట్టారు. దీంతో దేవుడికి తల వంచాల్సి వచ్చింది అన్నారు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి.



## నిజామాబాద్ లో మరోసారి బిజెపి ని గెలిపించిన ప్రజలు కార్యకర్తల శ్రమ వెలకట్టలేనిది: డాక్టర్ బోగ శ్రావణి

జగిత్యాల జూన్ 05 (ప్రజామంటలు):

భారతీయ జనతా పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులుగా రెండోసారి ధర్మపురి అరవింద్ ఎన్నికైన సందర్భంగా మరియు భారతీయ జనతా పార్టీ తెలంగాణలో 8 సీట్లు సాధించిన సందర్భంగా జగిత్యాల నియోజకవర్గం ఆధ్వర్యంలో పట్టణంలో స్థానిక తాసిల్ చౌరస్తా వద్ద బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి మరియు జగిత్యాల జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ రావు.ఈ సందర్భంగా డాక్టర్ భోగ శ్రావణి మాట్లాడుతూ.... నరేంద్రమోదీ ని ఆశీర్వదిస్తూ ధర్మపురి అరవింద ని మరోసారి భారీ మెజారిటీతో ఎంపీగా గెలిపించిన పార్లమెంట్ ప్రజలకు మరియు ముఖ్యంగా జగిత్యాల నియోజకవర్గ ప్రజలకు పాదాభివందనాలు అన్నారు. ఈసారి మహిళలు ఎక్కువగా ఓటింగ్ పక్రియలో పాల్గొన్నారు. మోడీ నాయకత్వంలో కేంద్రంలో ప్రవేశపెట్టిన "నారీ శక్తి వందన్" బిల్లుకి అభినందనగా వారు పెద్ద ఎత్తున ఆశీర్వదించారు.వారికి యువత కూడా పెద్ద ఎత్తున బిజెపి వైపు మొగ్గు చూపడం జరిగింది. బిజెపికి అందించిన ఆశీర్వాదాన్ని ఎప్పుడు మరువము అరవిందన్నతో తప్పకుండా జగిత్యాల అభివృద్ధి చేయించే బాధ్యత తీసుకుంటాం. బూత్ సాయి కార్యకర్తల నుండి పదాధికారుల వరకు ప్రతి ఒక్కరు ఎంతో కష్టపడి పార్టీకి అరవింద్ అన్నకి ఘన విజయాన్ని అందించారు. వారందరికీ కృతజ్ఞతాభివందనాలు.

## ట్రీట్మెంట్ పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్ జూన్ 05 ( ప్రజామంటలు):



చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్.ఐ. పి. కిషోర్ కథనం ప్రకారం..గత నెల 31న డయల్ 100 కు వచ్చిన ఫోన్ ఆధారంతో మైలార్ గడ్డ ప్రాంతానికి వెళ్ళిన పోలీసులకు అక్కడ రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి (60) కనిపించాడు. వెంటనే స్థానికుల సహాకారంతో అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించి, చికిత్స ఇప్పించారు. సదరు వ్యక్తి ట్రీట్మెంట్ పొందుతూ గాంధీ ఆసుపత్రిలో చనిపోయినట్లు తెలిపారు. చనిపోయిన వ్యక్తి వివరాలు లభించకపోవడంతో గాంధీ మార్చురీకి డెడ్ బాడీ తరలించి, భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమకు తెలపాలని ఎస్.ఐ. సూచించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రశాంతంగా టిజి ఐసెట్-2024 కన్వీనర్ ఆచార్య నరసింహ చారి

**హన్మకొండ జూన్ 05 (ప్రజా మంటలు) :**



తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ లోని ఎంపిక చేసిన 115 పరీక్ష కేంద్రాల్లో 2024%-%25 విద్యా సంవత్సరానికి ఎం.బి.ఎ. మరియు ఎం.సి.ఎ ప్రవేశాలు పొందటానికి నిర్వహించు టి జి ఐ సెట్-2024 ప్రవేశ పరీక్ష 5 వ తేది ఉదయం మొదటి సెషన్ లో ప్రశాంతంగా నిర్వహించబడినట్లు ఐ-సెట్ కన్వీనర్ ఆచార్య ఎస్. నరసింహ చారి తెలిపారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ లోని ఎంపిక చేసిన 115 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 28931 విద్యార్థులు నమోదు చేసుకోగా 25982 మంది హాజరైనట్లు, మధ్యాహ్నం జరిగిన రెండవ సెషన్ లో ఎంపిక చేసిన 116 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 28969 విద్యార్థులు నమోదు చేసుకోగా 26298 హాజరైనట్లు, జూన్ 6 వ తేది ఉదయం సెషన్ తో ప్రవేశ పరీక్ష పూర్తవుతుందని అయన తెలిపారు. వరంగల్ రీజియన్ లోని వరంగల్, నర్సంపేట్ లోని 8 సెంటర్స్ లో 5 వ తేది ఉదయం మొదటి సెషన్ లో మొత్తం 1554 విద్యార్థులు నమోదు చేసుకోగా 1446 హాజరైనట్లు, అదే విధంగా మధ్యాహ్నం జరిగిన రెండవ సెషన్ లో మొత్తం 1554 విద్యార్థులు నమోదు చేసుకోగా 1462 హాజరైనట్లు అయన తెలిపారు.

## బండి సంజయ్ 2,25,000 పైచిలుకు ఓట్లతో విజయం హుస్నాబాద్ పట్టణంలో విజయోత్సవ ర్యాలీ

హుస్నాబాద్ జూన్ 05 (ప్రజామంటలు):



నిన్న వెలువడిన పార్లమెంటు ఎన్నికల ఫలితాలలో బీజేపీ అభ్యర్థి శ్రీ బండి సంజయ్ కుమార్ 2,25,000 పై చిలుకు ఓట్లతో విజయం సాధించిన సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలో పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, మండల అధ్యక్షులు వెల్దండి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీని హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి నుండి గాంధీ మల్లె చెట్టు నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు కార్యకర్తల నృత్యాలు బానిసంచాలు పేల్చుకుంటూ పట్టణంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ ర్యాలీకి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ కోమటిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.... హుస్నాబాద్ నియోజకవర్గంలో స్థానిక మంత్రి కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఎన్ని ప్రలోభాల గురి చేసిన హుస్నాబాద్ నియోజకవర్గ ఓటరు భారతీయ జనతా పార్టీని ఆశీర్వదించారని ఈ సందర్భంగా ఓటర్లందరికి కృతజ్ఞతలు తెలిపినారు మరియు హుస్నాబాద్ పట్టణంలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి అభ్యర్థి శ్రీ బండి సంజయ్ కి మెజారిటీ ఇవ్వడం పట్ల హుస్నాబాద్ ప్రజలకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, లక్కీరెడ్డి తిరుమల మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, తోట స్వరూప, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు, బొమ్మగాని సతీష్ అక్కన్నపేట మండల అధ్యక్షులు, మహేందర్ రెడ్డి పట్టణ ప్రధాన కార్యదర్శిలు, తగరం లక్ష్మణ్, చందు మండల ప్రధాన కార్యదర్శులు, సంపత్ నాయక్, మహేశ్వర్ రెడ్డి బొల్లీ శ్రీనివాస్ బిజెవైఎం జిల్లా అధికారప్రతినిధి భూషంకర్, పట్టణ మండల అధ్యక్షులు, పోలోజు రాజేందర్, కుమారస్వామి, శక్తి కేంద్ర ఇన్చార్జిలు, మహేష్కర్, రాంప్రసాద్, నాగార్జున, సీనియర్ నాయకులు, చిట్టి గోపాల్ రెడ్డి, వేముల దేవేందర్ రెడ్డి, గుత్తికొండ విద్యాసాగర్, బోనగిరి రవీందర్, వెలదండి సంతోష్, బత్తుల శంకర్, వీరచారి, అనంతస్వామి, కురుమెల్లి శ్రీనివాస్ తోట సమయ్య, మల్లం ప్రశాంత్, అరుణ్, రవీందర్, రైనా నాయక్ బూత్ అధ్యక్షులు, లక్ష్మయ్య, రాంరెడ్డి, రాజేష్, సాంబరాజు, శేఖర్, వెంకటేష్, సాయికృష్ణ, నరేష్ రమేష్, కొంకటి కిషోర్, గణేష్, అనిత, కార్యకర్తలు, బిజెపి అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.



భారతీయ జనతా పార్టీ కరీంనగర్ పార్లమెంట్ సభ్యులుగా బండి సంజయ్ కుమార్ రెండోసారి భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా కరీంనగర్ లో జరిగిన విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి



బీజేపీ భీమదేవరపల్లి మండల అధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీ రాజ్ కుమారుడు శివానుస్ మొదటి పుట్టినరోజు వేడుకలో పాల్గొని ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేసిన బీజేపీ హుస్నాబాద్ పట్టణ మాజీ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, అక్కన్నపేట మండల మాజీ అధ్యక్షుడు గోళ్లపల్లి వీరాచారి, పట్టణ ఉపాధ్యక్షులు గాదాసు రాంప్రసాద్, బీజేపీ సీనియర్ నాయకులు బొల్లి శ్రీనివాస్

## కోనాపూర్ లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం : డాక్టర్ నాగేల్లి కృష్ణతేజ



సారంగాపూర్ జూన్ 05 (ప్రజామంటలు):

సారంగాపూర్ మండలం కోనాపూర్ గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, డిపార్టుమెంట్ ఫర్ వెల్ఫేర్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్ అండ్ డిజేబుల్డ్ పర్సన్స్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరానికి వచ్చి స్పందన వచ్చింది. ఈ సందర్భంగా గత సంవత్సరం నుంచి సుమారు 100 పై గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని డాక్టర్ కృష్ణతేజ అన్నారు. ఈ రోజు సుమారు 90 మంది వయో వృద్ధులకు, వికలాంగులకు, పరీక్షించి మందులను అందజేశారు. అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొబైల్ మెడికేర్ యూనిట్ సభ్యులు, ఏఎన్ఎం. అరుణ కుమారి, లక్ష్మీ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలు కమిషన్ నిబంధనల మేరకు నిర్వహించాలి కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష

జగిత్యాల జూన్ 05 (ప్రజామంటలు):



ఈ నెల 9 న జరుగనున్న గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష పకడ్బందీగా, కమీషన్ నిబంధనల మేరకు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. బుధవారం రోజున చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్, పరిశీలకులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ%ూ%. జిల్లాలో 22 కేంద్రాల్లో 7692 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష హాలులోకి ఉదయం 9.00 గంటలకు నిశిత పరిశీలన చేస్తూ కేంద్రం లోకి పంపించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 10 గంటలకు మెయిన్ ద్వారం మూసి వేయడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులను బయో మెట్రిక్ అటెండెన్స్ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష నిర్వహణకు ఏ ఒక్క పొరపాటుకు తావివ్వకుండా నిర్వహించాలని, ఇన్విజిలేటర్, చీఫ్ సూపరింటెండెంట్, పరిశీలకులు సంయుక్తంగా వారికి కేటాయించిన విధులు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ నియమ నిబంధనల మేరకు నిర్వహించాలని అన్నారు. అభ్యర్థులు చేయదగినవి, చేయకూడనివి అంశాల బ్యానర్లు ప్రతీ కేంద్రంలో ఏర్పాటు చేయాలని అన్నారు. విధులు నిర్వహించే సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని అన్నారు. కమీషన్ నిబంధనలో పేర్కొన్న గాడ్జెస్ లను కేంద్రంలోకి అనుమతించబోమని తెలిపారు. అభ్యర్థులు ఒక గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, వివిధ ప్రాంతాల నుండి వచ్చే అభ్యర్థుల సౌకర్యం కోసం ముందస్తు సమయానికి బస్సు లు నడిచెవిదంగా ఏర్పాట్లు ఆర్టీసీ చేస్తుందని, పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగ కుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలలో మెడికల్ టీమ్ లు ఏర్పాటు చేయాలని, త్రాగునీరు తదితర సౌకర్యం ఏర్పాటు చేయాలని అన్నారు. నిర్ణీత సమయాల్లో క్వశ్చన్ పేపర్, ఓ.ఎం.ఆర్. షీట్లు పంపిణీ చేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల లోనికి ఏ వాహనాలను అనుమతించకూడదని, బయట పార్కింగ్ చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 విధించడం, బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. సెల్ ఫోన్స్, గాడ్జేస్ అనుమతించబోమని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వినోద్ కుమార్, రీజనల్ కోఆర్డినేటర్ వేణు గోపాల్, కలెక్టరేట్ పర్యవేక్షకులు విశ్వంభర్, తదితరులు పాల్గొన్నారు.

# మోడీపై విశ్వాసంతోనే 8 సీట్లు గెలుపు: డికె అరుణ

## రెఫరెండం అన్న సిఎం రేవంత్ రాజీనామా చేయాలి



హైదరాబాద్, జూన్ 5 (ప్రజా మంటలు): పార్లమెంట్ ఎన్నికలు తన పాలనకు రెఫరెండం అన్న సిఎం రేవంత్ రెడ్డి తక్షణం రాజీనామా చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఇకపోతే సిఎం సొంత జిల్లాలో ఓటమి చెందారని అననారు. మోడీ నాయకత్వాన్ని ప్రజలు విశ్వసించి ఓటేశారని, అందుకే తామె 8 సీట్లు గెలిచామని అననారు. కేంద్ర మంత్రి పదవి కోసం లాబీయింగ్ చేయడం లేదని.. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా పనిచేస్తానని ఎంపీ డీకే అరుణ అన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆమె చిట్‌చాట్ నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పాలనకు రెఫరెండమని చెప్పారు. 14 స్థానాల్లో విజయం సాధిస్తామన్నారు .. ఇప్పుడేమైందని ప్రశ్నించారు. ప్రధాని మోదీ రాజీనామా చేసి తప్పుకోవడం కాదని.. మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి పాలైనందుకు సీఎం పదవి నుంచి రేవంత్ వైదొలగాలన్నారు. భారాస ఆత్మబలిదానం చేసుకుని భాజపాను గెలిపించిందని రేవంత్ తప్పుడు ప్రచారం చేశారు. మహబూబ్‌నగర్‌లో ఓడిపోతే అభివృద్ధి జరగదని చెప్పారు. అక్కడ ఆయనే అభ్యర్థిలా వ్యవహరించారు. కొందరు నేతలు కర్ణాటక నుంచి వచ్చి ఎన్నికల్లో డబ్బులు పంచారు. రాష్ట్రంలో భాజపాకు 10 సీట్లు వస్తాయని అంచనా వేశాం.. కానీ 8కి పరిమితం అయ్యాం. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి గ్రామం, ప్రతి ఇంటికీ మోదీ అభివృద్ధి నినాదం వెళ్లింది. భాజపాను అడ్డుకునేందుకు రిజర్వేషన్లు తీసేస్తారంటూ రేవంత్ తప్పుడు ప్రచారం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే కేంద్రంతో ఇక్కడి ప్రభుత్వం స్నేహ పూర్వకంగా వ్యవహరించాలని డీకే అరుణ అన్నారు.

# కాంగ్రెస్‌లో పట్టు సాధించిన రేవంత్

## 8 సీట్ల గెలుపుతో తిరుగులేని నేతగా నిరూపణ

## బిజెపి బెదిరింపులు ఇక సాగక పోవచ్చు



హైదరాబాద్, జూన్ 5 (ప్రజా మంటలు): తెలంగాణ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఓ రకంగా సిఎం రేవంత్ రెడ్డికి బూస్ట్ లాంటివే. మూడు స్థానాలు ఉన్న పార్టీని 8కి చేర్చిన ఘనత రేవంత్‌దే. ఇపపుడు పార్టీలోనూ, ప్రబుత్వంలోనూ ఇక రేవంత్ రెడ్డికి తిరుగు లేనట్లే. అలాగే మున్ముందు ఆయన తీసుకోబోయే నిర్ణయాలు అతడి స్థాయిని మరింత పెంచగలవు. లోక్‌సబ ఫలితాలను బట్టి రేవంత్ రెడ్డి ప్రభుత్వ మనుగడ ఉంటుందని రాజకీయవర్గాలు అంచనాకు వేశాయి. కాంగ్రెస్ తిరుగులేని విజయం సాధించకపోయినా 8 సీట్లు సాధించడం గొప్ప విషయంగానే చూడాలి. దీంతో ఆ పార్టీ ప్రభుత్వానికి వచ్చే నష్టమేం లేదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. దీనికి కారణం బీజేపీతో సమానంగా సీట్లు తెచ్చుకోవడమే కాదు కేంద్రంలో బీజేపీకి సంపూర్ణ మెజార్టీ రాకపోవడం కూడా ఓ కారణమని అంచనా వేస్తున్నారు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం కారణంగా మోడీ దూకుడు రాజకీయాలు ఇక పనిచేయవు. రాష్ట్రాలను ఇక్కట్లకు గురిచేసే చర్యలకు దిగకపోవచ్చు. చెరో ఎనిమిది సీట్లు గెల్చుకున్న కాంగ్రెస్, బీజేపీలు బిఆర్‌ఎస్‌ను ఉనికిలో లేకుండా చేశాయి. ఈ క్రమంలో ప్రస్తుతం ఆ పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలు కూడా జంప్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. తెలంగాణ లోక్ సభ ఎన్నికల ఫలితాలు అనుకున్నట్లుగానే బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటాపోటాగా సాగాయి. చివరికి రెండు పార్టీలు చెరో ఎనిమిది సీట్లను గెల్చుకున్నాయి. మజ్లిస్ పార్టీ తన హైదరాబాద్ సీటును నిలబెట్టుకుంది. బీఆర్ఎస్ పార్టీకి ఒక్కటంటే ఒక్కటి కూడా రాలేదు. రెండు, మూడు చోట్ల మినహా అన్ని చోట్ల మూడో స్థానంలో ఉంది. చాలా చోట్ల డిపాజిట్లు కోల్పోయింది. కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. అంటే.. కాంగ్రెస్ కు మరో ఎమ్మెల్యే యాడ్ అయ్యారు. ఇప్పుడు కాంగ్రెస్ కు అధికారికంగా అరవై ఐదు మంది ఎమ్మెల్యేలు ఉంటారు. బీఆర్ఎస్ నుంచి వచ్చి చేరిన వారు అదనం. బీజేపీ కాంగ్రెస్ కన్నా ఒకటి , రెండు సీట్లలో ఎక్కువ సాధించి ఉన్నట్లయితే..ఆ పార్టీ నుంచి కాపాడుకోవడం కష్టమయ్యేది. ఇప్పుడు కేంద్రంలోనూ బీజేపీ బలహీన ప్రభుత్వమే ఏర్పడుతోంది. మిత్రపక్షాల మీద ఆధారపడి ప్రభుత్వాన్ని నడపాల్సి ఉంటుంది. అందుకే వారు తెలంగాణ ప్రభుత్వం జోలికి వచ్చే అవకాశం లేదు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటి నుండి ఆ ప్రభుత్వం ఉండదని పదే పదే అభిప్రాయం చెప్పేవారే ఎక్కువగా ఉన్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతలు ఇదే పాట పాడుతూ వచ్చారు. ఎలా జరుగుతుందో కూడా విశ్లేషించేవారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరిమితంగా సీట్లు వస్తాయని.. బీజేపీకి ఎక్కువ వస్తాయని ఆ తర్వాత బీజేపీ ఆ ప్రభుత్వాన్ని పడగొట్టేస్తుందని అంచనాలు వేస్తూ వచ్చారు. కేసీఆర్ కూడా తమ పార్టీ సమావేశాల్లో ఇవే చెబుతూ వచ్చారు. వందకుపైగా ఎమ్మెల్యేలు ఉన్న తన ప్రభుత్వాన్నే కూల్చేందుకు బీజేపీ నేతలు ప్రయత్నించారని కాంగ్రెస్ కు సహించే ప్రశ్నే ఉండదని ఆయన అభిప్రాయం. ఈ పరిస్థితి తీసుకు రావడానికి ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో కేసీఆర్ బీజేపీకి సహకరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరిగిందని తేల్చేందుకు బీజేపీకి సైలెంట్ గా సపోర్టు చేశారు. అది లోక్ సభ ఎన్నికల ఫలితాల్లో స్పష్టమయింది. అయితే తెలంగాణలో బీజేపీ .. ఎనిమిది సీట్లు సాధించింది కానీ... దేశంలో అంత ప్రోత్సాహకర ఫలితాలు లేవు. అందుకే బీజేపీ సంయమనం పాటించే అవకాశం ఉంది. అయితే బీజేపీ బలపడే ప్రయత్నాలు మాత్రం ఆపదు. బీఆర్ఎస్ ఉనికిని వీలైనంతంగా పరిమితం చేసేందుకు ప్రయత్నిస్తుంది. బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ ను కాపాడుకోలేకపోయింది. ఇప్పుడు ఆ పార్టీకి చెందిన క్యాడర్ ను బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పంచుకుంటాయి. ఎక్కువగా బీజేపీ పంచన చేరిపోతారు. ఎందుకంటే.. మరో రెండు, మూడేళ్ల తర్వాత అయినా కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయంగా నిలబడే పార్టీగా బీజేపీనే చూస్తారు. అందుకే ఆ పార్టీలో చేరిపోతారు. బీఆర్ఎస్ క్రమంగా బలహీనపడుతుంది. బీఆర్ఎస్ స్థానాన్ని బీజేపీ ఆక్రమిస్తుంది. ఎమ్మెల్యేల చేరికలతో అసెంబ్లీలోనూ ప్రతిపక్ష స్థానానికి బీజేపీ చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం ఉండదు. ఇకపోతే సొంత జిల్లా మహబూబ్ నగర్ పార్లమెంట్ స్థానంలో గట్టిగా పోరాడినా ఓడిపోవాల్సి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులే గెలిచినా పార్టీ ఓడిపోయింది. డీకే అరుణకు.. బీఆర్ఎస్ పార్టీ సహకరించడమే కారణం అని విశ్లేషిస్తున్నారు. అలాగే తన సిట్టింగ్ సీటు మల్కాజిగిరిలో బీజేపీ అభ్యర్థి ఈటల భారీ మెజారిటీతో గెలిచారు.

# ఇక్కడ కలెక్టర్లు..అక్కడ ఎమ్మెల్యేలు

నిజామాబాద్, జూన్ 5 (ప్రజా మంటలు): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పాలనాధికారులుగా ఇది వరకు పని చేసిన బి.రామాంజనేయులు, డి.వరప్రసాద్ ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. రామాంజనేయులు 2007 జూన్ 7 నుంచి 2009 జూన్ 17 వరకు ఇందూరు కలెక్టర్‌గా పని చేశారు. ఆయన గుంటూరు జిల్లా ప్రత్తిపాడు(ఎస్సీ) నియోజకవర్గం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా 42,015 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. డి.వరప్రసాద్ 2010 ఫిబ్రవరి 17 నుంచి 2012 జులై 30 వరకు ఇక్కడ పనిచేశారు. ఆయన కోనసీమ జిల్లా రాజోల్(ఎస్సీ) నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీచేసి 39,011 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

# ఎరువులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీలు

కామారెడ్డి, జూన్ 5 (ప్రజా మంటలు): జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మి కామారెడ్డి జిల్లా పెద్దకొడప్గల్ మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రంలోని అన్ని దుకాణాల్లో రికార్డులు పరిశీలించగా సక్రమంగా నమోదు చేస్తున్నట్లు గుర్తించారు. స్థానికంగా విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారీ, ఏఏవోలు ఎరువుల, విత్తనాల దుకాణాలను పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాల్లాడుతూ.. రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో ధరలను, కాలపరిమితి, చూసుకొని రశీదులను భద్రంగా దాచుకోవలని తెలియజేశారు. ఆమె వెంట ఏవో నదీమ్, తదితరులు ఉన్నారు.

# మోడీపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం

## షుగర్ ఫ్యాక్టరీ తెరిపించేందుకు కృషి : అర్వింద్



నిజామాబాద్, జూన్ 5 (ప్రజా మంటలు): ప్రజలు బిజెపి పట్ల, మోడీపైనా విశ్వాసంతో తనను మరోమారు గెలిపించారని, అందుకు వారికి కృతజ్ఞతలని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్ అన్నారు. మోడీ నాయకత్వంపై తెలంగాణ ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారని అన్నారు. అందుకే గతంలో 4 సీట్లు ఉన్న బిజెపిని 8కి చేర్చారని అన్నారు. నిజాబమాబాద్ పసుపు రైతుల సమస్య తీరిందని అన్నారు. తనను అక్కున చేర్చుకున్న రైతులకు అండగా ఉంటానని అన్నారు. అలాగే షుగర్ ఫ్యాక్టరీ తెరిపించేందుకు కృషి చేస్తానని అన్నారు. తను ఇచ్చిన మేరకు హామీల అమలుకు కృషి చేస్తానని బుధవారం నాడిక్కడ పార్టీ కార్యాలయంలో మీడియాతో అన్నారు. ఇది మోదీ కుటుంబ విజయమని ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. మోదీ కుటుంబ సభ్యులైన ఎమ్మెల్యేలు, జిల్లా, మండల నేతలు, మోర్చా నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు ఇలా ప్రతి ఒక్కరు కష్టపడి గెలిపించారన్నారు. రైతులు, యువత, అన్నివర్గాలు ఓట్లేసి బలపరిచారని, ముఖ్యంగా మహిళలకు చేతులెత్తి దండం పెట్టడంతో పాటు పాదాభివందనం చేస్తున్నానని చెప్పారు. తనకంటే ఎక్కువగా నాయకులు, కార్యకర్తలు కష్టపడ్డారని పేర్కొన్నారు. ఇది బృంద విజయమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలిచామన్నారు. భారీ మెజారిటీతో పార్టీ ఎదుగుదలకు పునాది పడిందన్నారు. మూడోసారి నరేంద్ర మోదీ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారని చెప్పారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతి కార్యకర్త సంబరాలు చేసుకోవాల్సిన తరుణమిదన్నారు. భాజపా తన సిట్టింగ్ సీటు నిజామాబాద్ లోక్‌సభ స్థానాన్ని నిలబెట్టుకొంది. ఆ పార్టీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ ఇక్కడి నుంచి వరుసగా రెండోసారి విజయం సాధించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిపై 1,09,241 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు. అర్వింద్‌కు 5,92,318 ఓట్లు రాగా.. జీవన్‌రెడ్డికి 4,83,077 ఓట్లు పోలయ్యాయి. గత ఎన్నికల్లో భారాస అభ్యర్థి కవితపై 70 వేల పైచిలుకు ఓట్ల తేడాతో గెలుపొందిన అర్వింద్, ఈసారి మెజార్టీని మరో 40 వేలు పెంచుకున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగానే నాలుగు అసెంబ్లీ స్థానాల పరిధిలో పెద్ద సంఖ్యలో ఆధిక్యం సాధించారు. నిజామాబాద్ రూరల్, కోరుట్ల, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లో ప్రత్యర్థి పార్టీల అంచనాలు తారుమారు చేశారు. నిజామాబాద్ అర్బన్‌లో మాత్రం ఆయన అనుకున్న స్థాయిలో ఓట్లు రాలేదని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# హామీల అమలుకు ఒత్తిడి తెస్తూనే ఉంటా

## మాజీ ఎంపి మాలోత్ కవిత వెల్లడి

మహబూబాబాద్, జూన్ 5 (ప్రజా మంటలు): ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేదాకా ప్రభుత్వాలను ప్రశ్నిస్తామని మాజీ ఎంపీ మాలోతు కవిత అన్నారు. హామీలను అమలు చేయాలన ఇనిత్యం కోరేఉతూనే ఉంటామని అన్నారు. బుధవారం మహబూబాబాద్ క్యాంప్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. పోరాటమన్నది కొత్తకాదు. గెలిస్తే పొంగిపోయేది లేదు, ఓడిపోతే కృంగిపోయేది లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన నిలిచి పోరాడుతామన్నారు. నా ప్రయాణంలో నాతో కలిసి వచ్చిన అభిమానులకు, కార్యకర్తలకు కష్ట నష్టాల్లో అందుబాటులో ఉంటారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి శిరస్సువంచి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, రవీందర్ రావు, జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన

కామారెడ్డి, జూన్ 5 (ప్రజా మంటలు): సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇండియన్ సైబర్ క్రైంల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రతీ నెల మొదటి బుధవారం సైబర్ జాగృతి దివాస్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం కామారెడ్డి జిల్లా పెద్దకొడప్గల్ మండల కేంద్రంలో ప్రజలకు, విద్యార్థులకు ఏఎస్సై రాములు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్, వ్యక్తిగత వివరాలను పంచుకోకూడదని తెలిపారు. ఉచిత భహుమతులకు ఆశపడకుండా జాగ్రత్త పడాలని సలహాలు, సూచనలు చేశారు. సైబర్ క్రైంకు గురైనట్లు అనిపిస్తే బాధితులు వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సాయిశివ, సంజీవ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# కొనసాగుతున్న దోస్త్ ప్రక్రియ

## నేడు డిగ్రీల్లో ఫస్ట్ ఫేజ్ సీట్ల కేటాయింపు

హైదరాబాద్, జూన్ 5 (ప్రజా మంటలు): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం దోస్త్ రిజిస్ట్రేషన్ల పక్రియ కొనసాగుతోంది. దోస్త్ ఫస్ట్ ఫేజ్ సీట్ల కేటాయింపు ఈ నెల 6వ తేదీన జరగనుంది. ఈ మేరకు ఉన్నత విద్యా మండలిలో మధ్యాహ్నం 3 గంటలకు మీడియా సమావేశం ఏర్పాటు చేసి సీట్ల కేటాయింపు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్ లింబాద్రితో పాటు దోస్త్ కన్వీనర్ పాల్గొననున్నారు. రాష్ట్రంలోని 1066 కాలేజీల్లో మొత్తం 4,49,449 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మూడు విడతల్లో దోస్త్ పక్రియను పూర్తిచేస్తారు.

# థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఎస్పీ ఇంటికి పట్టాభి

## జాషువా లేకపోవడంతో వెనుదిగిన టిడిపి నేత



అమరావతి, జూన్ 5 (ప్రజా మంటలు): ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించిన క్రమంలో ఇప్పటికే అధికారులు సర్దుకుంటున్నారు. కొన్నిచోట్ల విచిత్ర ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల్లో వైసీపీ కేవలం11 సీట్లు సాధించి ఘోర ఓటమి చవిచూసింది. ఈ ఫలితాలతో వైసీపీకి కొమ్ముకాసిన అధికారుల్లో భయం మొదలైనట్లు కనిపిస్తోంది. టీడీపీ అధినేత చంద్రబాబు, కీలక నేతలపై అక్రమ కేసులు పెట్టించిన వైసీపీ ముఖ్య నేతలు కొంతమంది విదేశాలకు వెళ్తున్నారని సమాచారం. వారికి సహకరించిన అధికారులు కూడా ఒక్కొక్కరిగా రాజీనామాల బాట పడుతున్నారు. మరి కొంతమంది అధికారులు అండర్ గ్రౌండ్‌లోకి వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే 2023లో కృష్ణా జిల్లా ఎస్పీగా పనిచేసిన జాషువా గురించి కూడా చర్చ జరుగుతోంది. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తప్పుచేసిన అధికారులను వదలిపెట్టబోమని హెచ్చరించిన విషయం తెలిసిందే. వైసీపీకి వత్తాసు పలికిన అధికారుల లిస్ట్‌ను తాను రెడ్‌బుక్‌లో ఎక్కించుకున్నట్లు కూడా వార్నింగ్ ఇచ్చారు. టీడీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టిన అధికారులు అయితే తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి రామ్‌పై కూడా అప్పటి కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా అక్రమ కేసులు బనాయించి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని పలుమార్లు తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బుధవారం జాషువాని మర్యాదపూర్వకంగా కలిసేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా పట్టాభి రామ్ మీడియాతో మాట్లాడారు. నన్ను అక్రమంగా నిర్బంధించి రాచమర్యాదలు చేసిన అప్పటి కృష్ణ జిల్లా ఎస్పీ జాషువా గారిని మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చా. 2023 ఫిబ్రవరి 20 వ తేదీన కృష్ణా జిల్లా తోట్లవల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఒక అక్రమకేసులో నన్ను నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారు. అర్ధరాత్రి కరెంటు తీసేసి జాషువా థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. ఆయనను కలిసి బొకే ఇచ్చేందుకు అతని నివాసానికి వచ్చా. విజయవాడ సమీపంలో తన ఏడున్నర ఎకరాల్లో ఉన్న విలాసవంతమైన అతిథి గృహంలో ఉన్నారని తెలుసుకుని వచ్చా. పుషగుచ్ఛం, శాలువాతో సత్కారం చేద్దామని వచ్చాను. అయితే అతను ఇక్కడ లేరని, నిన్న ఫలితాలు వెలువడిన దగ్గర నుంచి ఆయన సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి వెళ్లిపోయారని వాచ్‌మెన్ చెప్పారు. అతిథి గృహంలోనే ఒక కుర్చీలో పుష్పగుచ్ఛం, శాలువాను ఉంచి వీడియో ద్వారా తన సందేశాన్ని ఎస్పీ సెల్ ఫోన్‌కు పంపించానని పట్టాభి పేర్కొన్నారు.

# అర్వింద్ గెలుపునకు కాంగ్రెస్ పరోక్ష మద్దతు

## బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి బాజిరెడ్డి విమర్శలు



నిజామాబాద్, జూన్ 5 (ప్రజా మంటలు): భాజపా గెలవడానికి కాంగ్రెస్ అవలంబించిన విధానాలే కారణమని భారాస ఎంపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. గత ఎన్నికల్లో భాజపాకు సహకరించిన జీవన్‌రెడ్డిని అభ్యర్థిగా నిలపడం, అర్వింద్‌కు సన్నిహితంగా ఉండే బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వడమే ఇందుకు నిదర్శనమన్నారు. గత ఎన్నికల్లో జీవన్‌రెడ్డి భాజపాకు ఓట్లు వేయించడాన్ని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అదే అలవాటుగా మళ్లీ కమలం గుర్తుకు ఓట్లు వేశారన్నారు. తమ పార్టీ ఇతరులకు సహకరించినట్లు ఆరోపణలు చేయటం సరికాదన్నారు. తమది ఉద్యమ పార్టీ అని.. ప్రజల తరఫున పోరాడి మళ్లీ అధికారంలోకి వస్తామన్నారు. భారాసకు ఆదరణ లభించకపోవడానికి కారణం ప్రజలు జాతీయ ఎన్నికలు అనే భావనతో ఓట్లేశారన్నారు. మత విద్వేషాలతో భాజపా గెలుస్తోందని ఆరోపించారు. తెలంగాణకు భారాసనే శ్రీరామ రక్ష అని చెప్పారు. తనకు ఓట్లు వేసిన వారికి, కష్టపడిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# నకిలీ విత్తనాలు, నిషేధిత గడ్డి మందు పట్టివేత

## ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

సూర్యాపేట, జూన్ 5 (ప్రజా మంటలు): సూర్యాపేట జిల్లాలో నకిలీ విత్తనాలు, నిషేధిత గడ్డిమందును పోలీసులు పట్టుకున్నారు. నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి 52 కిలోల నకిలీ పత్తి విత్తనాలు, మూడు లక్షల రూపాయల విలువగల 300 లీటర్ల నిషేధిత గడ్డి మందులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. నకిలీ విత్తనాలు, నిషేధిత గడ్డిమందునక్విక్రయిస్తున్న సంకేపల్లి సోమిరెడ్డి(53 ), గుగులోత్ ప్రేమ్ కుమర్ (29) అనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని వారిని త్వరలో పట్టుకుంటామన్నారు. అలాగే అర్వపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కోదూరు గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని 22 కిలోల నకిలీ పత్తి విత్తనాలు సీజ్ చేశారని తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. అన్నదాతను నమ్మించి మోసం చేసి నకిలీ విత్తనాలను విక్రయిస్తే సహించేది లేదని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఎవరైన నకిలీ విత్తనాలను, విక్రయించినా, సరఫరా చేసిన వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు.

# అహంకారంపై అంకుశం

### అక్రమాలపై ప్రజల త్రివిక్రమావతారం
### తెలంగాణ తరహాలోనే ఎపిలోనూ తీర్పు
### ప్రజల నాడి పట్టలేక పోయిన వైకాపా నేతలు

**అమరావతి, జూన్ 5 (ప్రజా మంటలు):**
ప్రజలు కేవలం డబ్బుల పందేరాన్ని కాకుండా అభివృద్ధిని కూడా కోరుకుంటారని, అలాగే అరాచకాలను సహించరని ఎపి ప్రజలు స్పష్టం చేశారు. జగన్ ఇంత ఘోరంగా ఓడిపోవడానికి ఈ రెండూ కారణమని రాజకీయ వేత్తలు విశ్లేషిస్తున్నారు. ప్రశాంత్ కిశోర్ ముందే ఈ విషయం చెప్పారు. కేవలం డబ్బులు పందేరం చేసి, అభివృద్ధిని పక్కన పెట్టరాదన్నారు. అలాగే నిరంకుశ, అక్రమాలను కూడా సమించరని అర్థం అయిపోయింది. ప్రజలు దేనినైనా సహిస్తారు కానీ.. అహంకారాన్ని ఉపేక్షించబోరనడానికి తెలంగాణ, ఏపీ ఎన్నికల ఫలితాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. తమకు తిరుగులేదు అన్ని స్థానాల్లో విజయం మాదే.. అభ్యర్థికంటే తనను చూసే ఓటేస్తారని తెలంగాణలో గత ఏడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్ భావించారు. కానీ ప్రజలు మాత్రం అభివృద్ధి, సంక్షేమం పక్కనపెడితే అహంకారాన్ని సహించబోమని తీర్పునిచ్చారు. ప్రతిపక్షాలను పట్టించుకోకుండా.. ప్రజలను చిన్నచూపు చేసే నాయకులు మాకొద్దని తిరస్కరించారు. వ్యవస్థలను తప్పుదోవపట్టించి.. రాజకీయ ప్రయోజనాలకోసం వాడుకుంటే సహించేది లేదంటూ కేసీఆర్‌ను గ్దదె దించారు. ప్రస్తుతం ఏపీ ఎన్నికల ఫలితాల్లోనూ అదే పరిస్థితి కనిపించింది. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రఅభివృద్ధిని పక్కనపెట్టి.. రాజకీయ కక్ష తీర్చుకోవడానికి వ్యవస్థలను ఉపయోగించుకున్నారనేది బహిరంగ రహస్యం. తప్పుడు కేసులతో ప్రతిపక్ష నాయకులను జైల్లో పెట్టి వేధింపులకు గురిచేయడం ప్రజలకు నచ్చలేదు. ప్రజాపాలన అందిచమని అధికారం ఇస్తే ప్రజలను, రాష్ట్ర అభివృద్ధి గాలికొదిలేసి రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేయడాన్ని ప్రజలు తిరస్కరించారనేది ఎన్నికల ఫలితం స్పష్టం చేస్తోంది. ఈ క్రమంలో తాము కోరుకుంటున్న విధంగా ఏపీ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. ఐదేళ్ల వైసీపీ పాలనపై ఓటర్లు ఎంత వ్యతిరేకంగా ఉన్నారో ఫలితాలు స్పష్టం చేశాయి. సంక్షేమ పథకాల పేరుతో వేల కోట్ల రూపాయిలు నేరుగా ప్రజల ఖాతాల్లో వేసినా ఓట్లు పడకపోవడం వైసీపీ అధినేత జగన్‌ను ఆశ్చర్యం కలిగించింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్దపొందిన లబ్దిదారులు ఓట్లు వేస్తారని భావించిన జగన్ ఆశలు నెరవేరలేదు. ఐదేళ్లలో దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని సంక్షేమ పథకాలు అమలు చేశామని జగన్ చెప్పుకున్న గొప్పలను ప్రజలు విశ్వసించ లేదు. రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేసి.. సంక్షేమ పథకాల కోసం లక్షల కోట్లు అప్పులు చేయడం ప్రజలకు నచ్చలేదు. రాజధాని విషయంలో జగన్ నిర్ణయాన్ని ప్రజలు తప్పుపట్టారనేది ఎన్నికల ఫలితాలు తెలియ జేస్తున్నాయి. అలాగే రాజధాని ఉద్యమంలో ముందుకు నడిచిన రైతులను కనీసం పరామర్శించక పోగా వారినందరినీ పెయిడ్ ఆర్టిస్టులుగా చిత్రీకరిచి, కేసులతో జైలుకు పంపిన తీరు కూడా చూసాం. సంక్షేమ పథకాలు అమలు చేసినా.. పేద, మధ్య తరగతి ప్రజల బ్యాంకు ఖాతాల్లో నేరుగా డబ్బులు జమచేసినా ఓట్లు ఎందుకు పడలేదనే ప్రశ్నలతో ఇప్పుడు వైసీపీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. వైసీపీ ఇంతటి ఘోర పరజాయానికి కారణం ఏమిటో ప్రజలకు మాత్రం అర్థం అయ్యింది. కనీసం ప్రతిపక్ష హోదా కూడా వైసీపీకి దక్కలేదంటే ప్రజలు జగన్ తీరుపై ఎంత ఆగ్రహంగా ఉన్నారో అర్థమవుతోంది. వైసీపీ ఓటమికి జగన్ పాలనాతీరు, జగన్ అహంకార పూరిత ప్రవర్తన అనే చర్చ రాష్ట్రవ్యాప్తంగా సాగుతోంది. ముఖ్యంగా ఐదేళ్ల పాలనలో ఏ మేరకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశారనేది ఒక ఎత్తయితే.. ప్రభుత్వ ప్రవర్తన ఏ విధంగా ఉందనేది మరో ఎత్తు. వైసీసీ అధినేత జగన్‌తో పాటు ఆయన మంత్రివర్గంలోని సహచరుల ప్రవర్తన ప్రజలకు నచ్చకపోవడంతోనే ఈ విధమైన తీర్పు ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది. నాయకుడు అహంకారంతో విర్రవీగితే ఏమౌతుందో ప్రజలు రుచి చూపించారు. ఐదేళ్లు సీఎంగా జగన్మోహన్ రెడ్డి విపరీతమైన అహంకార ధోరణిని ప్రదర్శించడమే ప్రస్తుతం ఆయన ఓటమికి ముఖ్య కారణంగా తెలుస్తోంది. వైసీపీ నాయకుల ప్రవర్తనే వారిని ఓడించిందనే చర్చ జరుగుతోంది. వైసీపీలో గ్రామ స్థాయి నాయకుడు మొదలు రాష్ట్రస్థాయి నాయకుల వరకు ప్రతి ఒక్కరూ తమ



ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి చెప్పడం మానేసి... ప్రతిపక్ష పార్టీలైన టీడీపీ, జనసేన నేతలను టా÷-గ్గ్ం÷ట్ చేసి ఇబ్బంది పెట్టడాన్ని రాష్ట్రప్రజలు అంగీకరించలేదనేది ఈ ఫలితాలకు తర్కాణం. తాను పదుల సంఖ్యలో నొక్కిన బటన్లు ఓట్లు తెచ్చిపెట్టలేదని ఫలితాల తర్వాత జగన్ బాధపడటం కన్నా.. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతీకార చర్యలకు పోకుండా అభివృద్ధిపై దృష్టిపెడితే ఇలాంటి ఘోర పరాజయం చవిచూడాల్సి వచ్చేది కాదనే చర్చ రాష్ట్రంలో నడుస్తోంది. ఏది ఏమైనప్పటికీ అహంకారంతో వ్యవహరించే నాయకులకు ఏపీ ఎన్నికల ఫలితాలు ఓ గుణపాఠంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## చంద్రబాబు ఇంటివద్ద సందడి

### సిఎస్ జవహర్ రెడ్డి, డిజిపి హరీష్ గుప్తా అభినందనలు
### ఎమ్మెల్యేలు, ఎంపిల రాకతో పండగ వాతావరణం
### భద్రతను కట్టుదిట్టం చేసిన అధికారులు

**అమరావతి,జూన్ 5 (ప్రజా మంటలు):**
సార్వత్రిక ఎన్నికల్లో తిరుగులేని విజయాన్ని అందుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.. బుధవారం ఉదయం చంద్రబాబు నివాసానికి వెళ్లిన ఏపీ సీఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా.. మర్యాదపూర్వకంగా కలిసి అబినందనలు తెలిపారు. ఇక, చంద్రబాబును కలిసిన వారిలో పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు.. మాజీ డీజీపీ ఆర్పీ ఠాగూర్ సైతం కాబోయే ఏపీ సీఎంకు శుభాకంక్షలు తెలిపారు. టిడిపి అధినేత చంద్రబాబును కలిసేందుకు ప్రభుత్వ ఉన్నతాధికారులు, గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆయన నివాసానికి చేరుకున్నారు. సీఎస్ జవహర్ రెడ్డి, మాజీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ చంద్రబాబు నివాసానికి వచ్చారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పలువురు ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలిపేందుకు అక్కడికి చేరుకున్నారు. పర్యావరణ, అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ చంద్రబాబుని కలిసేందుకు ఉండవల్లిలోని ఆయన ఇంటికి వచ్చారు. అలాగే గెలిచిన ఎంపీలు, ఎమ్మెల్యేలు పెద్దఎత్తున తరలివచ్చారు. నందమూరి బాలకృష్ణ, కేశినేని చిన్ని, బోండా ఉమా, నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, నక్కా ఆనంద్ బాబు, గద్దె రామ్మోహన్, కొలుసు పార్థసారథి.. చంద్రబాబు నివాసానికి చేరుకున్నారు. డోలా బాలవీరాంజనేయ స్వామి, ధూళిపాళ్ల నరేంద్ర, పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, జూలకంటి బ్రహ్మారెడ్డి, అయితాబత్తుల ఆనందరావు, బోడె ప్రసాద్, అనగాని సత్యప్రసాద్ తదితరులు వచ్చారు. దీంతో టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటి వద్ద సందడి వాతావరణం చోటు చేసుకుంది. మంగళవారం జరిగిన ఎన్నికల కౌంటింగ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభంజనం సృష్టించింది. సునామీల దూసుకెళ్లింది. వైసీపీని 11 స్థానాలకు పరిమితం చేసి.. మిగిలిన స్థానాలన్నింటినీ కూటమి తన ఖాతాలో వేసుకుంది. చంద్రబాబు నివాసం వద్ద భద్రతను అధికారులు మరింత పెంచారు. కేంద్రంలో ఎన్డీఏ కూటమిలో చంద్రబాబు కీలకంగా కావడంతో నేషనల్ మీడియా సైతం చంద్రబాబుకు అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ఇక రాజకీయ ప్రముఖులతో పాటు అధికారులు చంద్రబాబును కలిసేందుకు క్యూ కడుతున్నారు. అలాగే చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపేందుకు కేశినేని చిన్ని, బోండా ఉమా, డోలా బాలవీరాంజనేయ స్వామి, ధూళిపాళ్ల నరేంద్ర, పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, అయితాబత్తుల ఆనందరావు, బోడె ప్రసాద్, అనగాని సత్యప్రసాద్ తదితరులు వచ్చారు. అధికారులు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, సీఎస్ జవహర్ రెడ్డి, మాజీ డీజీపీ ఆర్పీ ఠాగూర్ తదితరులు చంద్రబాబుకి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజల తీర్పును గౌరవిస్తున్నాం

### చంద్రబాబు, పవన్‌లకు షర్మిల శుభాకాంక్షలు
### ప్రజల ఆకాంక్షలు నెరేవరేలా పాలించాలని సూచన



**విజయవాడ, జూన్ 5 (ప్రజా మంటలు):**
రాష్ట్ర ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని, కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు , జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఈ సందర్భంగా ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ఎన్నికల్లో ఓటమిపై స్పందించిన ఆమె బుధవారం విజయవాడ లో మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షల మేరకు ఏర్పడిన కొత్త ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ఏపీకి ప్రత్యేక హోదా రావాలని, పోలవరంతో సహా అన్ని ప్రాజెక్టులు పూర్తి కావాలని ఆమె ఆకాంక్షించారు. అలాగే ఏపీకి రాజధాని నిర్మాణం జరగాలని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, సంక్షేమం, అభివృద్ధి సమానంగా సాగాలని, ప్రజలు ఇచ్చిన ఇంత పెద్ద మెజారిటీతో ముందుకు అడుగు వేయాలని షర్మిల అన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం ఆలోచన చేసి, ప్రత్యేక హోదా కోసం కట్టుబడాలని, అన్ని విభజన హామీలకు కేంద్రం కట్టుబడాలని.. అలా అయితేనే కేంద్రానికి మద్దతు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ, జనం గొంతుకగా మారిన కాంగ్రెస్ పార్టీ, ఇక మీదట కూడా రాష్ట్ర ప్రజల పక్షాన నిలబడుతుందని, ప్రభుత్వ నిర్లక్ష్యాలను ఎండగడుతుందని షర్మిల స్పష్టం చేశారు.

## సలహాదారు పదవికి సజ్జల రాజీనామా



**అమరావతి,జూన్ 5 (ప్రజా మంటలు):**
అసెంబ్లీ ఎన్నికల్లో వైకాపా ఘోరంగా ఓడిపోవడంతో పలువురు ప్రభుత్వ సలహాదారులు తమ పదవులకు రాజీనామాలు చేశారు. జగన్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన సజ్జల రామకృష్ణారెడ్డితో సహా 20 మందికి పైగా సలహాదారులు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లుగా సీఎస్ జవహర్‌రెడ్డికి లేఖలు పంపారు. జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి తదితరులు ఇప్పటికే తమ రాజీనామా లేఖలు సమర్పించారు. ఫలితాలు వెలువడిన వెంటనే తితిదే ఛైర్మన్ పదవికి భూమన కరుణాకర్‌రెడ్డి రాజీనామా చేశారు. తనను రిలీవ్ చేయాలని సమాచార పౌర సంబంధాలశాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల ఫలితాలకు ముందు పదవీ కాలాన్ని పొడిగించాలని ఆయన ప్రభుత్వానికి దరఖాస్తు పంపించడం గమనార్హం.

## లోక్‌సభ విజేతల రికార్డుల మోత

### అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో రాకిర్డు నమోదు
### పది లక్షల 8వేల 77 ఓట్ల మెజారిటీ సాధించిన లాల్వానీ

**న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):**
లోక్‌సభ ఎన్నికల్లో బంపర్ మెజారిటీలు సాధించిన వారి గురించి చర్చ ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. కొందరు అభ్యర్థులు లక్షల్లో మెజార్టీలు అందుకున్నారు. ఎవరూ ఊహించని విధంగా మెజారిటీలతో రికార్డులను సొంతం చేసుకున్నారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో బీజేపీ నేత శంకర్ లాల్వానీకి ఏకంగా పది లక్షల 8వేల 77 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఇది దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇక్కడ నాటకీయ పరిణామాల మధ్య కాంగ్రెస్ అభ్యర్థి అక్షయ్ కాంతిరామ్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ అభ్యర్థి బరిలో లేకపోవడంతో, కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు నోటాకు ఓటేశారు. నోటాకు రెండు లక్షల 18వేల 676 ఓట్లు పడటం రికార్డు. మెజారిటీ ఒక రికార్డు అయితే, నోటాకు ఇన్ని ఓట్లు రావడం మరో రికార్డు. అసోంలోని ధుబ్రిలో రకీబుల్ హుస్సేన్‌కు కూడా ధమాకా మెజారిటీ వచ్చింది. ఆయనకు ఏకంగా పది లక్షల 12వేల 476 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఈయన ఏకంగా ఆలిండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ అధినేత బద్రుద్దీన్ అజ్మల్‌పై ఈ స్థాయిలో గెలుపొందడం హైలైట్. మధ్యప్రదేశ్ ప్రజలు మామాజీ అని పిలుచుకునే మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ప్రజాదరణ ఏమాత్రం తగ్గలేదని రుజువైంది. విదిశ నుంచి పోటీచేసిన మామాజీకి ఏకంగా ఎనిమిది లక్షల 21వేల 408 మెజారిటీ వచ్చింది. ఇందుకు బీజేపీ హవా కూడా కారణమైంది. గుజరాత్ నవసారి నుంచి పోటీచేసిన అఖీ పాటిల్ ఏకంగా ఏడు లక్షల 73వేల 551 ఓట్ల మెజారిటీ సాధించారు. ఇక కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్రనేతల్లో ఒకరైన అమిత్ షా, బంపర్ విక్టరీ కొట్టారు. గాంధీనగర్ నుంచి



బరిలోకి దిగిన అమిత్ షాకు ఏకంగా ఏడులక్షల 44వేల 716 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఎన్నికల ప్రచారంలో దేశమంతటా ప్రచారం చేసినా, తన నియోజకవర్గానికి పెద్దగా సమయం కేటాయించలేదు. అయినా గాంధీనగర్ ప్రజలు ఆయన్ను రికార్డుస్థాయిలో ఆశీర్వదించారు. బెంగాల్ సిఎం మమతా బెనర్జీ అల్లుడు, టిఎంసి నాయకుడు అభిషేక్ బెనర్జీ భారీ విక్టరీ కొట్టారు. డైమండ్ హార్బర్ నుంచి ఆయన పోటీచేసిన అభిషేక్ బెనర్జీకి ఏడు లక్షల 10వేల 930 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఇక తెలుగురాష్ట్రాల్లో బంపర్ మెజారిటీలో కొత్త రికార్డు నమోదైంది. సీనియర్ నాయకుడు జానారెడ్డి కొడుకు రఘువీర్ రెడ్డికి నల్గొండలో ఏకంగా ఐదు లక్షల 59వేల 905 ఓట్ల మెజారిటీ వచ్చింది. కాంగ్రెస్‌కు కంచుకోటవంటి నల్గొండలో ఆయనకు తిరుగులేని మెజారిటీ వచ్చింది. ఇప్పటిదాకా తెలుగు రాష్ట్రాల్లో జగన్‌కు 2011 కడప లోక్‌సభ ఉపఎన్నికలో 5.43 లక్షల మెజారిటీ వచ్చింది. ఆ మెజారిటీని రఘువీర్ రెడ్డి అధిగమించారు.

## సచివాలయంలో ఈ ఆఫీస్ సీజ్

### స్వాధీనం చేసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు



**అమరావతి,జూన్ 5 (ప్రజా మంటలు):**
ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ఐటీ శాఖ ఆధ్వర్యంలో నడిచే ఈ-ఆఫీస్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తాళం వేసి లాగిన్ ఐడీలు క్లోజ్ చేశారు. సీఎం కార్యాలయానికి చెందిన ్గ÷ళ్లు ఈ-ఆఫీస్ నుంచి మాయం చేస్తున్నారని డీజీపీకి ఫిర్యాదు అందిన వెంటనే సైబర్ క్రైమ్, ఇతర పోలీస్ టీమ్‌లు రంగంలోకి దిగారు. వారం రోజుల నుంచి జరిగిన ఫైళ్ల మూవ్మెంట్‌ను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. కొన్ని శాఖల అధికారులు ఫైళ్లు చించి వేస్తున్నారని పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఛైర్మన్ హేమచంద్రారెడ్డి.. ఫైళ్లను ముక్కలు ముక్కలుగా చింపేశారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ-ఆఫీస్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కొంతమంది ఉద్యోగులను సైతం పోలీసు అధికారులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన తప్పుల నుంచి కాపాడుకునేందుకే ఫైళ్లు చింపివేస్తూ, మాయం చేస్తున్నారని కూటమి శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో వారికి భయం పట్టుకుందన్నారు. తప్పులు బయటపడతాయని వారికి తెలుసని, అందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడుతున్నారు.

## ప్రజలు లేకుండా జగన్ పాలన

### అందుకే విపక్షానికి కూడా పనికిరారని తీర్పు
### మాజీమంత్రి, టిడిపి నేత యనమల



**కాకినాడ,జూన్5 (ప్రజా మంటలు):**
ప్రజాస్వామ్యంలో ప్రజలు చాలా ముఖ్యమని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. ప్రజలను విస్మరించి పాలన చేయలేమని అన్నారు. కూటమి గెలుపు తర్వాత యనమల తొలిసారిగా మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రజలు చాలా ముఖ్యమన్నారు. నాయకుల ప్రవర్తన సరిగా లేకపోతే ప్రజలు గుణపాఠం చెబుతారన్నదానికి ఎన్నికల ఫలితాలే ఉదాహరణ అని పేర్కొన్నారు. ప్రజలు మంచి చేసిన ప్రభుత్వాలకే తోడుగా ఉంటారన్నారు. చెడు చేసిన వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పారన్నారు. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజల సంపదను దోచేసి ధనవంతులయ్యారని యనమల పేర్కొన్నారు. జగన్ దోపిడీ పాలనకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారన్నారు. వైసీపీ ఓటమికి జగన్ ఆకృత్యాలు, అవినీతి, దోపిడీలే కారణమన్నారు. జగన్ పరిపాలనకు, ప్రతిపక్షానికి కూడా అనర్హుడని ప్రజలు తేల్చారని యనమల పేర్కొన్నారు. ఐదేళ్లలో వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయని చెప్పారు. సహజ సంపద విచ్చలవిడిగా దోచుకున్నారన్నారు. విద్యుత్ ఛార్జీలను పెంచేసి ప్రజలపై భారం మోపారని వివరించారు. వైకాపా పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ ఎలా ఇబ్బంది పడ్డాయో చూశామన్నారు. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలన్నదే తెలుగు దేశం ధ్యేయం. రాజకీయాల్లో ఎవరూ శాశ్వతం కాదని, అయితే తాను శామాత్రం శాశ్వతం అని జగన్ ఊహించుకున్నారని అన్నారు. దేశం, ప్రజాస్వామ్యం, పార్టీలు శాశ్వతం. పార్టీలు కూడా సక్రమంగా పనిచేస్తే మళ్లీ ప్రజలు ఆదరిస్తారు. ఇంత చరిత్రాత్మకమైన ఎన్నికలు ఎప్పుడూ చూడలేదు. తెదేపా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఎన్నికలు ఇవని అన్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com